Follow: @ANNTELUGU

25-02-2026

# మహా పత్రిక

ANN తెలుగు

బుధవారం, హైదరాబాద్   సంపుటి- 23   సంచిక- 58   పేజీలు-08   వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM




# చిరకాల వాంఛ నెరవేర్చారు

### ముఖ్యమంత్రికి ఉద్యోగసంఘాల కృతజ్ఞతలు

**హైదరాబాద్, మహా:** ఉద్యోగులకు ప్రమాద బీమా, ఆరోగ్య పథకాలను ప్రకటించడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసిన టీజీవో, టీఎన్జీవో, రెవెన్యూ, ఉపాధ్యాయ, పెన్షనర్ల తదితర సంఘాల నాయకులు, ఉద్యోగులు తమ చిరకాల వాంఛను నెరవేర్చారంటూ ముఖ్యమంత్రిపై ఉద్యోగ సంఘాల నేతలు ప్రశంసలు కురిపించారు. ఈ రెండు పథకాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. 652 గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్సలకు అవకాశాలు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిని తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, వి.లచ్చిరెడ్డి , కె.రామకృష్ణ తదితరులు కలిశారు.

## టాప్ న్యూస్



**జూన్‌లో వరంగల్ విమానాశ్రయం శంకుస్థాపన**
- విమానాశ్రయాల పురోగతిపై ఢిల్లీలో కీలకభేటీ

02

**ఓవైసీ కళ్ళలో ఆనందం కోసమే..**
- జీహెచ్ఎంసీ మూడు ముక్కలు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్
- స్వర్ణ దేవాలయంగా భాగ్యలక్ష్మి టెంపుల్

02



**మహేష్ బాబు రాజమౌళి ఫైట్**
- ఏఐతో సినిమా చచ్చిందంటూ వర్మ పోస్ట్

02





# దమ్మున్న యువత కోసం జనసేన చూపు

### తెలంగాణ రాజకీయాలపై పవన్ కల్యాణ్ ఫోకస్

మునిసిపల్ ఎన్నికల్లో అనూహ్య అరంగేట్రం.. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు రెడీ

సభ్యత్వ నమోదు, సంస్థాగత పటిష్టతపై దృష్టి

**హైదరాబాద్ - మహా**

డబ్బున్న నాయకులు కాదు.. దమ్మున్న యువత కావాలి, తెలంగాణలో పార్టీ బలోపేతం వాళ్ల చేతుల్లోనే ఉంది అంటూ జనసేనాని పవన్ కల్యాణ్ కొండగట్టులో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరో రాజకీయశక్తికి ఊపిరిపోస్తున్నాయి. రానున్న రోజుల్లో జనసేన తెలంగాణ రాజకీయాల్లో సంచలనాలకు కేంద్రబిందువుగా మారుతుందన్న అభిప్రాయం ఆ పార్టీ నేతల్లో వ్యక్తమవుతోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఫోకస్ తెలంగాణ వైపు షిఫ్ట్ చేయడంతో ఈ ప్రాంతంలో జనసేన ఫ్యూచర్ పై అంచనాలు పెరిగాయి. ఇప్పటివరకు ఏపీ పైన ఫోకస్ పెట్టి హండ్రెడ్ పర్సెంటట్ స్ట్రైక్ రేట్ తో పోటీ చేసిన అన్ని స్థానాలు గెలుపొందిన జనసేన పార్టీని, తెలంగాణలో విస్తరించాలని డిసైడైంది. తెలంగాణలోని అన్ని కమిటీలు రద్దుచేసి కొత్త కమిటీలు వైపు అడుగులు వేయడంతో పాటు సభ్యత్వనమోదు పైన ఫోకస్ చేసింది. ఇటీవల ఎన్నికల్లో 300కు పైగా స్థానాల్లో పోటీచేయడం తెలంగాణ రాజకీయవర్గాలను ఆశ్చర్యపరచగా, తెలంగాణ ఇన్ ఛార్జిగా రామ్ తాళ్ళూరి పట్టుదల స్పష్టంగా కనబడుతోంది. గతంలో లాగా ఆషామాషీగా కాకుండా పకడ్బందీగా కనబడుతోంది. జనసేనాని పవన్ కల్యాణ్ రాకున్నా.. ప్రచారం సందర్భంగానైనా జాగ్రత్తలు తీసుకొని ఉంటే డబుల్ డిజిట్ స్థానాలు అరంగేట్రంలోనే దక్కేవన్న అభిప్రాయం ఉంది.

మిగతా 2లో

# కేరళ ఇక కేరళం

### రాష్ట్రం పేరు మార్పుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

అసెంబ్లీ ఎన్నికల ముందు కేంద్రం నిర్ణయం

గతంలో పేరుమారుస్తూ.. విజయన్ సారథ్యంలో అసెంబ్లీ తీర్మానం

కేరళం అంటే కొబ్బరిచెట్లతో నిండిన భూమి

**ఢిల్లీ, మహా:** గాడ్స్ ఓన్ కంట్రీ .. దేవభూమిగా పిలుచుకునే కేరళ రాష్ట్రం.. 'కేరళం'గా అవతరించింది. కేరళ రాష్ట్రం పేరు మార్చాలన్న ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. మలయాళ భాషా మూలాలను, స్థానిక సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. కేరళ అసెంబ్లీలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈ పేరు మార్పు తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రాల పేర్లను మార్చే అధికారం పార్లమెంటుకు ఉంటుంది. ఇప్పుడు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించి ఆమోదముద్ర వేసింది.

#### కేరళం అంటే ఏంటి..?

కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర క్యాబినెట్ నేడు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇకపై రాష్ట్రాన్ని 'కేరళం' అని పిలిచేలా సంబంధిత బిల్లుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మలయాళీ రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తాజా నిర్ణయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. అనాదిగా కేరళ ప్రాంతాన్ని స్థానికులు 'కేరళం' అని పిలుచుకుంటున్నారు. మలయాళ భాషలో ఈ పదానికి ఎంతో అందమైన, అర్థవంతమైన నేపథ్యం ఉంది.

మిగతా 2లో



# దేవ్ జీ సహా నలుగురు మావోయిస్టు అగ్రనేతల లొంగుబాటు

### 40 ఏళ్ల మావోయిస్ట్ ఉద్యమానికి చారిత్రాత్మక ముగింపు

ఎస్ఐబీ ఆపరేషన్లతో 21 వేల మందిపై చర్యలు.. కేంద్ర, రాష్ట్ర స్థాయి నేతల స్వచ్ఛంద సమర్పణ

నేపాల్‌లో ఉన్న గణపతి అచూకీపై పోలీసులు నజర్.. మీడియా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి

**హైదరాబాద్, మహా:** తెలంగాణను మావోయిస్ట్ రహిత రాష్ట్రంగా ప్రకటించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. మావోయిస్టు ఉద్యమం తెలంగాణలో దాదాపు ముగిసినట్లేనని, తెలంగాణకు చెందిన కేవలం 11 మంది మాత్రమే ప్రస్తుతం మావోయిస్టు ఉద్యమంలో ఉన్నారని, వీరిలో 10 మంది చిన్న చిన్న స్థానాలలో ఉండగా ఒక్కరు మాత్రం కీలక స్థానంలో ఉన్నారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ సెంట్రల్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో లొంగిపోయిన నలుగురు నేతలను మీడియా ముందు హాజరు పరిచిన డీజీపీ మాట్లాడుతూ, దాదాపు 40 ఏళ్లుగా సాగిన మావోయిస్ట్ ఉద్యమ చరిత్రకు ముగింపు పలికే విధంగా నలుగురు కీలక

మిగతా 2లో



# ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయండి

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒకేచోట 2,160 ఇండ్ల నిర్మాణం

మార్చి మొదటి వారంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

02

# జర్నలిస్టులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అక్రిడిటేషన్ కార్డులివ్వాలి

### బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీష్ రావు

**వరంగల్, మహా:** బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ఫ్రీ హెల్త్ స్కీమ్ తెచ్చిందని.. ఉద్యోగులకు 1% కంట్రిబ్యూషన్‌తో, జర్నలిస్టులకు పూర్తిగా ఉచితంగా సేవలు అందించాలని నిర్ణయించాం కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వం జర్నలిస్టులను చూస్తేనే విసుక్కుంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. మంగళవారం వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను హరీష్‌రావు ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ 100 కోట్లతో జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు బడ్జెట్లలో జర్నలిస్టుల కోసం ఒక్క రూపాయి అయినా కేటాయించిందా..? అని ప్రశ్నించారు. రెండున్నరేళ్లలో ఒక్కరికైనా కొత్త అక్రిడిటేషన్ కార్డ్ ఇచ్చారా..? జర్నలిస్టులకు ఎలాంటి నిబంధనలు లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.



బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసినట్లుగా జర్నలిస్టుల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌కు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని.. లేదంటే ప్రమాదవశాత్తు జర్నలిస్టులు మరణిస్తే వాళ్ల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌ను, జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌కు సమానంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.



# అధికారం ఎవ్వరికి శాశ్వతం కాదు

- **ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**
- **మంత్రి వివేక్ ఆటలు సాగవు**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **ఆదిలాబాద్ జైల్ లో బాల్క సుమన్ తో ములాఖత్**

**ఆదిలాబాద్ మహా :** అధికారం ఎవ్వరికి శాశ్వతం కాదన్న విషయాన్ని సీయం రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.మంగళవారం ఆదిలాబాద్ జిల్లా జైలులో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ములాఖత్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఖూని చేస్తుందన్నారు.బీజేపీ కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయన్నారు.క్యాతన్ పల్లిలో తమకు సంపూర్ణ మెజారిటీ ఉన్నా దక్కించుకునేందుకు మంత్రి వివేక్ కుట్రలు పన్నారన్నారు.

మిగతా 2లో

## దేశంలో అత్యధిక రుణమాఫీ చేసిన ఘనత రేవంత్ రెడ్డిదే

- రైతులకు అండగా నిలిచింది కాంగ్రెస్.. దగా చేసింది బీఆర్ఎస్
- ముఖ్యమంత్రిపై కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు
- ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి ధ్వజం

2లో




# దమ్మున్న యువత కోసం జనసేన చూపు

(మొదటిపేజీ తరువాయి)

ఒక కౌన్సిలర్, ఒక కార్పోరేటర్ ను గెలుచుకోవడం ద్వారా జనసేన తెలంగాణలో సంచలనం సృష్టించింది. పవన్ కల్యాణ్ భావజాలానికి తెలంగాణలోనూ పెద్ద ఎత్తున అభిమానులున్నా, ఇక్కడ భావోద్వేగాలను అర్థం చేసుకుని నేతలు సున్నితంగా రాజకీయాలు చేయాల్సి ఉంటుంది. సరైన వ్యూహం, తెలంగాణ ఫ్లేవర్ తో మరింత పకడ్బందీగా ముందుకెళితే.. తెలంగాణ అసెంబ్లీలోనూ జనసేన అరంగేట్రం ఖాయం కావడంతో పాటు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లోనూ మంచి ప్రభావం చూపే అవకాశాలున్నాయి.

**నెలరోజుల్లోనే రామ్ తాళ్ళూరి సంచలనం**

నెలరోజుల్లోనే 300కు పైగా స్థానాల్లో పోటీచేయించడంతో పాటు మునిసిపాలిటీలో, కార్పోరేషన్ లో జనసైనికులు అడుగుపెట్టే విజయాలు సాధించడం రామ్ తాళ్ళూరి పట్టుదలకు, వ్యూహానికి నిదర్శనంగా చెప్పవచ్చు. క్షేత్రస్థాయి నుండి మద్దతులేకున్నా, సరైన ముఖాలు లేకున్నా అధినేత పేరు, సిద్ధాంతాలు చెప్పే పార్టీని జనంలోకి తీసుకెళ్ళారు. జనసేన సరైన వ్యూహాన్ని రూపొందించుకుంటే, ఇదే పట్టుదల కనబరిస్తే తెలంగాణ రాజకీయాల్లోనూ ఒక పవర్ ఫుల్ శక్తిగా మారడం ఖాయమే. 'జనసేన పార్టీ తరపున తొలిసారిగా.. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేశాం. తొలి కౌన్సిలర్‌గా విజయం సాధించిన ఉమ్మడి



నల్గొండ జిల్లా నేరేడుచర్ల మున్సిపాలిటీ 14వ వార్డు అభ్యర్థి ఆరూరి విజయలక్ష్మికి మనస్ఫూర్తిగా అభినందనలు. మంచిర్యాల కార్పొరేషన్ 34వ డివిజన్ జనసేన అభ్యర్థి సాగర్ గెలుపు సొంతం చేసుకున్నారు. .ఈ ఎన్నికల ఫలితాలు ఎలా వచ్చినా సరే.. మరింత ఉత్సాహంతో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా కృషి చేయాలని కోరుతున్నా. రానున్న రోజుల్లో మరింత బలంగా తెలంగాణలో జనసేన జెండా ఎగురవేయడమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిస్తున్నా' అని రామ్ తాళ్లూరి ఫలితాల అనంతరం ట్వీట్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలే లక్ష్యంగా ఇపుడు జనసైనికులు రంగంలోకి దిగారు. సభ్యత్వనమోదు కార్యక్రమం కూడా మొదలైంది. గత ఎన్నికల్లో జనసేన పోటీకి సై అన్నా.. బీజేపీ నేతలు కలిసి త్యాగానికి ఒప్పించారు.

**పవన్ పట్టుదల**

తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా "తెలంగాణ రాష్ట్ర జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం" కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 26వ తేదీ నుండి దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించాలని పార్టీ నిర్ణయించిన నేపథ్యంలో, తెలంగాణలో ఈ ప్రక్రియను విజయవంతం చేయడానికి జిల్లాల వారీగా, గ్రేటర్ పరిధిలోని కార్పొరేషన్లకు ఇన్చార్జులను నియమించారు. రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించే బాధ్యతను పార్టీ ఉపాధ్యక్షులు బొంగునూరి మహేందర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జ్ నేమూరి శంకర్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు రాధారం రాజలింగం, కావ్య మండపాక, శిరీష పొన్నూరులకు అప్పగించారు.. పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడమే లక్ష్యంగా పవన్ ఎత్తుగడలు, రామ్ తాళ్ళూరి వ్యూహరచన కనబడుతోంది.

# కేరళ ఇక కేరళం

(మొదటిపేజీ తరువాయి)

'కేర' అంటే కొబ్బరి చెట్టు అని, 'ఆళం' అంటే భూమి లేదా నివాస ప్రదేశం అని అర్థం వస్తుంది. ఈ రెండు పదాల కలయికతోనే "కేరళం" ఆవిర్భవించింది. అంటే అక్షరాలా "కొబ్బరి చెట్లతో నిండిన భూమి" అని దీని పరమార్థం. భౌగోళికంగా చూసుకున్నా అరేబియా సముద్ర తీరమంతా పచ్చని కొబ్బరి తోటలతో ఈ రాష్ట్రం కనువిందు చేస్తుంది. ప్రాచీన కాలం నుంచి ఇక్కడి ప్రజల జీవనశైలి, ఆర్థిక వ్యవస్థ, వంటకాలు, సంస్కృతి అంతా కొబ్బరి చెట్టు చుట్టూనే అల్లుకుని ఉన్నాయి. కేవలం ఒక భౌగోళిక నామంగానే కాకుండా, అక్కడి ప్రకృతి వనరులను, మలయాళీ ప్రాచీన అస్తిత్వాన్ని ఈ 'కేరళం' అనే పదం స్పష్టంగా కళ్లకు కడుతుంది. తమ మూలాలను, స్థానికతను కాపాడుకునేందుకే రాష్ట్రం పేరును కేరళం అని మార్చుకోవాలని అక్కడి ప్రజలు బలంగా కోరుకుంటున్నారు.

**మరో దశ తర్వాతే**

కేంద్ర మంత్రివర్గం ఆమోదం తర్వాత ఈ ప్రక్రియ మరో దశకు చేరుతుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, రాష్ట్రపతి 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను రాష్ట్ర శాసనసభ అభిప్రాయం కోసం పంపుతారు. అక్కడి నుంచి ఆమోదం లభించాక, ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన తర్వాత రాజ్యాంగ సవరణ ద్వారా పేరు మార్పు అధికారికంగా అమల్లోకి వస్తుంది. వచ్చే ఏప్రిల్‌మే నెలల్లో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ఒరిస్సాను 'ఒడిశా'గా, పాండిచ్చేరిని 'పుదుచ్చేరి'గా మార్చిన తరహాలోనే ఇప్పుడు కేరళ పేరు కూడా మారుతోంది.

**కేరళన్, కేరళైట్ పదాల మాటేమిటి?**

కేరళ పేరును కేరళంగా మార్చడంపై కాంగ్రెస్ నేత శశి థరూర్ తనదైన రీతిపై స్పందించారు. రాష్ట్రం పేరును మారిస్తే అక్కడి ప్రజలను పిలిచే 'కేరళైట్', 'కేరళన్' లాంటి పదాల పరిస్థితి ఏమిటని సరదాగా ప్రశ్నించారు. 'కేరళం' వాసులను ఇకపై ఏమని పిలవాలి? అని చమత్కరించారు. వాస్తవానికి దీనిని కేబినెట్ నిర్ణయానికి ముందే ఎక్స్ వేదికగా ఆయన ఓ పోస్టు పెట్టారు. "ఇదంతా మంచిదే. కానీ ఇంగ్లీష్ మాట్లాడే మనలాంటి వారికి కోసం, భాషకు సంబంధించిన ఓ ప్రశ్న వేస్తాను. కేరళ ప్రజలను 'కేరళైట్', 'కేరళన్' అనే పదాలతో పిలుస్తారు. రాష్ట్రం పేరును కేరళం అని మారిస్తే, అప్పుడు అక్కడి ప్రజలను 'కేరళమైట్' అంటారు. ఇదోదే సూక్ష్మజీవి పేరులా ఉంది. ఇక 'కేరళమియన్' అంటే ఏదో అరుదైన ఖనిజం పేరులా అనిపిస్తోంది. ఈ పేరు మార్పు వల్ల పుట్టుకొచ్చే కొత్త పదాల కోసం కేరళ ముఖ్యమంత్రి ఓ పోటీని నిర్వహించాలేమో అంటూ సరదా పోస్టు పెట్టారు.



**కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు**

మంగళవారం కేంద్ర కేబినెట్ కేరళ పేరు మార్పుతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా బాలికలందరికీ ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేయించాలని తీర్మానించింది. అలాగే 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్దాసిల్ ఇంజెక్షన్ ఇవ్వాలని నిర్ణయించింది. మరోవైపు శ్రీనగర్‌లో రూ.1667 కోట్లతో ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి, రూ.1667 కోట్లతో అహ్మదాబాద్ మెట్రో విస్తరణకు ఆమోదం తెలిపింది. అలాగే విద్యుత్ రంగంలో సంస్కరణలు చేపట్టాలని నిర్ణయించింది.

### ఓవైసీ కళ్ళలో ఆనందం కోసమే జీహెచ్ఎంసీ

# మూడు ముక్కలు

## కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయాన్ని స్వర్ణ దేవాలయంగా మారుస్తామని కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడించారు. కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల్లో విజయం తర్వాత భాగ్యలక్ష్మీ అమ్మవారిని బండి సంజయ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత.. హిందూ ఆలయాలపై దాడులు పెరిగాయని.. ఎంఐఎం పార్టీతో కలిసి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలవడం.. ఒక ఆరంభం మాత్రమేనని.. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కూడా కాషాయ పార్టీ జెండా రెపరెపలాడుతుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఎంఐఎం అరాచకాలను అడ్డుకునే సత్తా కేవలం బీజేపీకి మాత్రమే ఉందని తేల్చి చెప్పారు. ఓవైసీ కళ్ళల్లో ఆనందం కోసమే జీహెచ్ఎంసిని మూడు ముక్కలు చేశారన్నారు. పంజాబ్‌లోని అమృత్‌సర్ గోల్డెన్ టెంపుల్ లాగే.. చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయానికి పూర్వవైభవం తీసుకొస్తామని ఈ సందర్భంగా బండి సంజయ్ హామీ ఇచ్చారు. హిందూ సమాజానికి రక్షణ కవచంగా ప్రస్తుతం ఈ భాగ్యలక్ష్మీ ఆలయం ఉందని పేర్కొన్నారు. మరోవైపు.. తాను గతంలో నిర్వహించిన ప్రజా సంగ్రామ యాత్ర భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం నుంచే మొదలై సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసినట్లు గుర్తు చేసుకున్నారు. 2021 ఆగస్టు 28వ తేదీన ప్రజా సంగ్రామ యాత్ర ప్రారంభం కాగా.. ఆ యాత్రకు నేటితో సరిగ్గా 1640 రోజులు పూర్తి కావడం ఒక అద్భుతమని.. అలాంటి రోజున మళ్లీ అమ్మవారిని దర్శించుకున్నట్లు వివరించారు.

**ఆలయాలపై దాడులు పెరిగాయి**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ ఆలయాలపై దాడులు పెరిగాయని బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడి, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం సహా సంతోష్ నగర్, శంషాబాద్‌లలో ఉన్న ఆలయాల్లో విగ్రహాలు ధ్వంసం చేశారని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎం పార్టీతో కాంగ్రెస్ పార్టీ కుమ్మక్కై హిందువుల మనోభావాలను దెబ్బతీస్తోందని తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం ఒక వర్గానికి కొమ్ముకాస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలో మెజారిటీ ప్రజలు తమ ఆస్తులు, ప్రాణాలు కాపాడుకునేందుకు బిచ్చమెత్తుకునే పరిస్థితి వచ్చిందని బండి సంజయ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

**హామీలపై క్యాబినెట్ చర్చ ఏది ?**

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన బండి సంజయ్.. ఆరు గ్యారంటీల అమలుపై నిలదీశారు. 18 మంత్రివర్గ సమావేశాల్లో రైతు భరోసా, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం వంటి హామీలపై ఒక్కసారి కూడా చర్చ జరగలేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల సమస్యలను గాలికొదిలేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఢిల్లీకి మూటలు మోసే బిజీలో ఉన్నారని తీవ్ర విమర్శలు చేశారు. ఉద్యోగుల పీఆర్సీ, డీఏ బకాయిల మాటే సీఎం రేవంత్ రెడ్డి ఎత్తడం లేదని ఆరోపించారు. ఉద్యోగుల సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ బిజినెస్ చేస్తోందని మండిపడ్డారు. బతికి ఉన్న వారికి ప్రయోజనాలు కల్పించకుండా.. చనిపోయిన తర్వాత బీమా ఇస్తామనడం ఏంటని ప్రశ్నించారు.

**ఎంఐఎంను ఎదుర్కొనే సత్తా మాకే ఉంది**

ఎంఐఎం అరాచకాలను అడ్డుకునే సత్తా కేవలం బీజేపీకి మాత్రమే ఉందని తేల్చి చెప్పారు. భాగ్యనగర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అభివృద్ధిని అడ్డుకుంటోందని మండిపడ్డారు. ఈ సందర్భంగా హిందూ సమాజం మేల్కోవాలని.. ధర్మ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. బాన్సువాడలో బీజేపీ నేతలపై జరుగుతున్న అక్రమ అరెస్టులను వెంటనే ఆపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

### మహేష్ బాబు

# రాజమౌళి ఫైట్

## ఏఐతో సినిమా చచ్చిందంటూ వర్మ పోస్ట్

**మహా:** స్టార్ హీరో మహేశ్‌బాబు , అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి గొడవ పడుతున్నట్లు ఉన్న ఏఐ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'సినిమా ఈజ్ డెడ్' అంటూ వర్మ పంచుకున్న ఈ ఫైటింగ్ వీడియోపై అనేక కామెంట్స్ వినిపిస్తున్నాయి. కొందరు ఈ క్రియేటివిటీని మెచ్చుకుంటుంటే, మరికొందరు తప్పుపడుతున్నారు. 'ఏఐతో ఏదైనా సాధ్యమే!' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 'వారణాసి ప్రచారం సమయంలో కచ్చితంగా ఈ వీడియోను ప్లే చేస్తా'రని వ్యాఖ్యలు జోడిస్తున్నారు. 'మహేశ్ పాస్‌పోర్ట్ విషయంలోనే ఇద్దరూ గొడవపడుతున్నారు' అంటూ అభిమానులు స్పందించడం గమనార్హం.

### అధికారం ఎవ్వరికి

# శాశ్వతం కాదు

(మొదటిపేజీ తరువాయి)

కోట్లు పెట్టి కౌన్సిలర్లను కొనే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు.3 కోట్లు ఆఫర్ ఇచ్చినా తమ కౌన్సిలర్లు లొంగలేదన్నారు.క్యాతన్ పల్లిలో మంత్రి వివేక్ ఆటలు సాగవన్నారు.మంత్రి అండ చూసుకుని అధికారులు రెచ్చిపోతున్నారని ప్రభుత్వ తొత్తులుగా పని చేస్తున్నారని విమర్శించారు. అందరిని గుర్తుపెట్టుకుంటామని తాము తిరిగి అధికారంలో కొచ్చాక వాళ్ల సంగతి చూస్తామన్నారు. రైతు బంధు ఇవ్వడానికి డబ్బులు లేవు కాని గాంధీ కుటుంబానికి 1,000 కోట్లు ఇవ్వడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధపడ్డారన్నారు.ఆ వెయ్యి కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు.బాల్క సమన్ కు జైలు కొత్త కాదన్నారు. ఉద్యమ సమయంలో అనేక సార్లు జైలుకు వెళ్లాడన్నారు. వచ్చేది తమ ప్రభుత్వమే అని గుర్తు పెట్టుకోవాలన్నారు.ఈ సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, ప్రశాంత్ రెడ్డి, పల్లె రాజేశ్వర్ రెడ్డి, వివేకానంద, గంగుల కమలాకర్, సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

### దేవ్ జీ సహా నలుగురు మావోయిస్టు

# అగ్రనేతల లొంగుబాటు

## 40 ఏళ్ల మావోయిస్ట్ ఉద్యమానికి చారిత్రాత్మక ముగింపు

**ఎస్ఐబీ ఆపరేషన్లతో 21 వేల మందిపై చర్యలు.. కేంద్ర, రాష్ట్ర స్థాయి నేతల స్వచ్ఛంద సమర్పణ**

**నేపాల్‌లో ఉన్న గణపతి అచూకీపై పోలీసులు నజర్.. మీడియా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి**

(మొదటిపేజీ తరువాయి)

అగ్రనేతలు పోలీసుల ఎదుట లొంగిపోయారన్నారు. లొంగిపోయిన వారిలో దేవుజి అలియాస్ తిప్పిరి తిరుపతి (ప్రస్తుతం మావోయిస్ట్ పార్టీ సెక్రటరీ), మల్లా రాజిరెడ్డి (కేంద్ర కమిటీ సభ్యుడు), బడే చొక్కారావు అలియాస్ దామోదర్ (స్టేట్ సెక్రటరీ), సున్నె నరసింహారెడ్డి (కేంద్ర కమిటీ సభ్యుడు) ఉన్నారు. వీరి లొంగుబాటుతో శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమైన మావోయిస్ట్ ఉద్యమం, నాలుగు దశాబ్దాల అనంతరం అధికారికంగా ముగింపు దశకు చేరినట్లైందని డీజీపీ పేర్కొన్నారు.

**మావోయిస్టులపై చర్యల్లో తెలంగాణ ఎస్ఐబీ రికార్డు**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మావోయిస్టులపై పలు ఆపరేషన్లు నిర్వహించింది. సోర్స్ బిల్డింగ్, సమగ్ర ఇంటెలిజెన్స్ సేకరణలో ఎస్ఐబీ కీలక పాత్ర పోషించింది. ఎస్ఐబీ తెలిపిన గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు 14,078 మంది వివిధ స్థాయిలలో మావోయిస్టు ఉద్యమంలో పని చేసిన వీరిని అరెస్టు చేయడం జరిగింది. వీరితో పాటు మరో 5,865 మంది లొంగిపోయారు. అదే విధంగా 1057 ఎన్ కౌంటర్ లలో మరో 1,289 మంది మృతి చెందారు. కేంద్ర కమిటీకి చెందిన 23 మంది సభ్యులపై కీలక సమాచారం సేకరించిన ఎస్ఐబీ 7 మందిని అరెస్టు చేయగా, మరో 7 మంది లొంగిపోయారు. 9 మంది ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. మొత్తంగా 21,232 మంది మావోయిస్టులపై చర్యల్లో ఎస్ఐబీ కీలక పాత్ర పోషించింది.

**మావోయిస్ట్ అగ్రనేత గణపతి అచూకీ**

మావోయిస్ట్ పార్టీకి దశాబ్దాల పాటు నాయకత్వం వహించిన అగ్రనేత గణపతి అచూకీ లభ్యమైనట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం. వృద్ధాప్యం, అనారోగ్య కారణాలతో పార్టీ సెక్రటరీ పదవిని వదిలిన గణపతి గత కొన్నేళ్లుగా నేపాల్‌లో తలదాచుకుంటున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. గణపతి ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. గణపతిని భారత్‌కు రప్పించే దిశగా తెలంగాణ పోలీసులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

**చరిత్రాత్మక లొంగుబాటు**

కేంద్ర సెక్రటరీ దేవుజి, స్టేట్ సెక్రటరీ బడే చొక్కారావు, కేంద్ర కమిటీ సభ్యులు మల్లా రాజిరెడ్డి, సున్నె నరసింహారెడ్డి లొంగుబాటు తెలంగాణ రాజకీయభద్రతా చరిత్రలో కీలక మలుపుగా భావిస్తున్నారు.మావోయిస్ట్ ఉద్యమానికి ముగింపు పలుకుతూ తెలంగాణ మావోయిస్ట్ రహిత రాష్ట్రంగా అవతరించబోతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. మీడియాతో మాట్లాడిన సందర్భంగా డీజీపీ గణపతికి సంబంధించిన సమాచారం తెలియదని, అయితే ఈ దశలో కొంత పురోగతి ఉందని నర్మగర్భంగా చెప్పారు. త్వరలోనే మరో కీలక సమాచారం వెల్లడిస్తామని, అదేం ఎక్కువ సమయం కాదని కేవలం నాలుగు రోజుల్లోనే మీ ముందుకు కీలక సమాచారంతో వస్తానని

# జూన్‌లో వరంగల్ విమానాశ్రయం శంఖుస్థాపన

**ఢిల్లీ, మహా:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విమానాశ్రయ ప్రాజెక్టుల పురోగతిపై ఢిల్లీలోని రాజీవ్ గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు మర్యాదపూర్వకంగా మంగళవారం సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలోని విమానాశ్రయాల అభివృద్ధిపై పౌర విమానయాన శాఖ కార్యదర్శి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్‌తో వరంగల్, ఆదిలాబాద్, పెద్దపల్లిలో ప్రతిపాదిత, పనులు జరుగుతున్న విమానాశ్రయ ప్రాజెక్టులపై విస్తృత చర్చ జరిపారు. ప్రాజెక్టుల వేగవంతమైన అమలుకు అవసరమైన చర్యలు, కేంద్రరాష్ట్రాల మధ్య సమన్వయం వంటి అంశాలపై సమీక్ష చేసి ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా వేగంగా పూర్తయ్యేలా నిర్ణయించారు. పరిపాలనా పరమైన, సాంకేతిక పరమైన సమస్యలుంటే తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వరంగల్ విమానాశ్రయం కోసం 953 ఎకరాల భూమి అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో 2500 మీటర్ల రన్‌వే నిర్మాణం చేపట్టనున్నట్లు, ప్రస్తుతం డిజైన్, స్కోప్ ఆఫ్ వర్క్, డీపీఆర్‌ను ఖరారు చేసే ప్రక్రియ తుదిదశలో ఉంది. 2026 జూన్ నెలలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించేలా కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు.

**ఆదిలాబాద్ భూసేకరణ పెండింగ్**

ఆదిలాబాద్‌లో విమానాశ్రయం కోసం భూసేకరణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని, అయితే రన్‌వే నిర్మాణానికి రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్న ప్రస్తుత భూమిని వినియోగించనున్నట్లు అధికారులు కేంద్రమంత్రులకు వివరించారు. విమానాశ్రయాన్ని జాయింట్ యుసేజ్ విధానంలో ఉపయోగించే అంశంపై భారత ప్రభుత్వం పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖలు.. విధివిధానాలను ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.

**పెద్దపల్లి ఎయిర్ పోర్టుపై స్టడీ**

పెద్దపల్లిలో విమానాశ్రయం కోసం 980 ఎకరాల భూమిని గుర్తించామని దీనికి సంబంధించిన ఫీజిబిలిటీ స్టడీ కూడా జరుగుతున్నట్లు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చైర్మన్ తెలిపారు. తెలంగాణలో విమాన రవాణా పెంచడం, పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేస్తే ఉపాధి అవకాశాలను విస్తరించడం లక్ష్యంగా ఈ విమానాశ్రయ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని గుర్తించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమానాశ్రయ మౌలిక వసతుల అభివృద్ధికి సంపూర్ణ మద్దతు అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



# ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయండి

- రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒకేచోట 2,160 ఇండ్ల నిర్మాణం
- మార్చి మొదటి వారంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హుజూర్ నగర్, మహా:** తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఎక్కడ ఒకే చోట 2,160 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి పేదలకు అందిస్తున్నామని పౌరసరఫరాల మరియు నీటిపారుదల శాఖ మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం హుజూర్ నగర్ పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో 125 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 2,160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్లను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి మంత్రి పరిశీలించారు అనంతరం మంత్రి క్యాంప్ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ 2011 లో నాడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హుజూర్ నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లులో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేటుకి కొనుగోలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని కానీ రాష్ట్ర విభజన తర్వాత ఆనాటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసి డంపింగ్ యార్డ్ మాదిరిగా మార్చిందని మండిపడ్డారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల నా పట్టుదల, కృషి ఆకాంక్షలతో తిరిగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తిచేసి పేద ప్రజలకు అందించడం తన చిరకాల స్వప్నం నెరవేరుతుందన్నారు. దీనిని తన అదృష్టంగా భావిస్తున్నానని, 1 ప్లాట్ కు రూ.6 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని ఒక్క ఫ్లాట్ విస్తీర్ణం 325 స్క్వేర్ ఫీట్ ఉంటుందని వివరించారు. రూ.75కోట్లతో అంతర్గత రోడ్లు, ఎలక్ట్రిసిటీ, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కొరకు ప్రభుత్వం నుండి మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించినట్లు వెల్లడించారు. మార్చి మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మొదటి విడతలో హుజూర్ నగర్ పట్టణంలోని లోకల్ లో ఇండ్లు లేని వారికి, నిరుపేదలు, తెల్ల రేషన్ కార్డు కలిగిన 1000 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు. రెండవ విడతలో హుజూర్ నగర్ మండలంలోని పేదలకు అందించడం జరుగుతుందని ఎంపిక ప్రక్రియలో ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్ పర్సన్, తహసీల్దార్ లు పారదర్శకంగా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి, అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు.ఈ సమావేశంలో ఎస్పీ కే నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### దేశంలో అత్యధిక రుణమాఫీచేసిన

# ఘనత రేవంత్ రెడ్డిదే

- రైతులకు అండగా నిలిచింది కాంగ్రెస్.. దగా చేసింది బీఆర్ఎస్
- ముఖ్యమంత్రిపై కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదు
- ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి ధ్వజం

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని, రుణమాఫీ చేస్తామని ఎగ్గొట్టిన చరిత్ర బీఆర్ఎస్ దని.. రెండు లక్షల రుణమాఫీ దేశంలో ఎవరూ చేయనట్లుగా అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ది అని అన్నారు. రైతుల అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, రూ.20వేల కోట్లకు పైగా రుణమాఫీ చేసి దేశంలో ఎవరూ చేయని సాహసం ముఖ్యమంత్రి చేశారని, నాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అన్నారని.. ఇపుడు వరి వేస్తే సన్న వడ్లకు క్వింటాకు రూ.500బోనస్ ఇచ్చి ప్రోత్సహిస్తున్నదన్నారు. పంటనష్టపోతే నాడు పట్టించుకున్న పాపాన పోలేదని, ఈ ప్రభుత్వంలో పంట నష్టపోయిన వారికి కూడా పరిహారం ఇచ్చారన్నారు. సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు అందించే పథకాలు ఈ ప్రభుత్వం తిరిగి పునరుద్దరించిందన్నారు. నాడు రైతుబంధు పేరుచెప్పి అన్ని పథకాలకు రైతుకు సున్నం పెట్టిందన్నారు. నేడు రైతుభరోసాతో పాటు ప్రభుత్వం రైతుకు అన్నివిధాలుగా అండగా నిలుస్తున్నదన్నారు. నాడు ఒక గడీ కట్టుకుని పరిపాలన సాగించారని, నేడు ప్రజాప్రభుత్వంలో ముఖ్యమంత్రి, మంత్రులందరూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు. కేటీఆర్ ఇంకా అధికారంలో ఉన్నామన్న భ్రమల్లో ఉన్నారని, వాస్తవంలోకి రావాలన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం గూర్చి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా...

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, మహా :** న్యాయవాదుల రక్షణ చట్టం రూపకల్పన గూర్చి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకోవెళ్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తానని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండే కార్ యాదిలాల్ ఆధ్వర్యంలో మంగళవారం బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి న్యాయవాదుల రక్షణ చట్టం రూపొందించి అమలు కు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలంతా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నానాటికి న్యాయవాదులపై దాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని వారు విచారం వ్యక్తం చేశారు. గతంలో కూడా అనేకమంది న్యాయవాదులు హత్యలకు గురయ్యారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని రూపొందించి వీలైనంత త్వరగా అమలు చేయాలని



కోరారు. అదేవిధంగా ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు అనువైన ఐదు ఎకరాల స్థలం కేటాయించి భవనం నిర్మించాలని యాధి లాల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే కసిరెడ్డి కోర్టు భవన నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. స్థలం కేటాయింపు పూర్తి కాగానే భవనాల నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. చట్టాలు ,న్యాయ వ్యవస్థ గురించి న్యాయవాదులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. సమాజసేవ, ప్రజా చైతన్య కార్యక్రమాలలో న్యాయవాదులు ముందుండాలని అన్నారు.



### ఇంటర్ పరీక్షలకు

# ఆమనగల్లు సిద్ధం

**అమనగల్లు, మహా :** ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లుపూర్తయ్యాయని చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.సుధారాణి తెలిపారు. ఈ కేంద్రంలో మొత్తం438 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, అందులో 199 మంది మొదటి సంవత్సరం వారుఉన్నారు. పరీక్షలను సీసీ కెమెరాల నిఘాలో పారదర్శకంగా నిర్వహించేందుకు స్ట్రాంగ్ రూమ్మరియు భద్రతా ఏర్పాట్లు సిద్ధం చేశామని, సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చామని ఆమె పేర్కొన్నారు.

EDITORIAL సంపాదకీయం

# పట్టణ తీర్పు... ప్రజా పాలనకు మద్దతు

ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే పరమావది. ప్రతి ఎన్నిక ప్రజల మనసులోని భావాలను వెలిబుచ్చే వేదిక. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు స్థానిక అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనపై ప్రజలు ఇచ్చే తీర్పుకు స్పందనగా నిలుస్తుంది. పట్టణాల్లో రహదారులు, నీటి సరఫరా, పారిశుధ్యం, మౌలిక వసతులు వంటి అంశాలపై ప్రభుత్వ పనితీరును ప్రజలు సమీక్షించే అవకాశమే ఈ ఎన్నికలు.తాజాగా వెలువడిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణలో 'ప్రజా పాలన' పట్ల ఉన్న విశ్వాసాన్ని మరొకసారి రుజువు చేశాయి. అభివృద్ధి, పారదర్శకత, సంక్షేమం అనే మూడు సూత్రాలపై ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తమ మద్దతును పునరుద్ఘాటించారు. ఈ తీర్పు కేవలం స్థానిక సంస్థల విజయం మాత్రమే కాదు రాష్ట్ర రాజకీయ దిశను నిర్దేశించే ప్రజల స్పష్టమైన సంకేతం.



తెలంగాణ రాజకీయాల్లో తాజా మున్సిపల్ ఎన్నికల ఫలితాలు స్పష్టమైన రాజకీయ సందేశాన్ని ఇచ్చాయి. ఇది కేవలం స్థానిక సంస్థల ఎన్నికల విజయం మాత్రమే కాదు, ప్రజలు రాష్ట్ర ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసానికి ప్రతీకగా చూడాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచార సభల్లో మాట్లాడుతూ—"2023లో నేను పీసీసీ అధ్యక్షుడిగా, మహేష్ కుమార్ గౌడ్ గారు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చాం. 2029లో మహేష్ కుమార్ గౌడ్ గారు పీసీసీ అధ్యక్షుడిగా, నేను ముఖ్యమంత్రిగా మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాం" అనే ధీమా ఇప్పుడు రాజకీయ వాస్తవంగా మారుతున్న దృశ్యంగా కనిపిస్తోంది. తాజా పురపాలక ఫలితాలు ఆ దిశగా ప్రజా మద్దతును బలంగా ప్రతిబింబించాయి.

పంచాయతీ ఎన్నికలలోనే బంపర్ విజయాన్ని నమోదు చేసిన కాంగ్రెస్, మున్సిపల్ ఎన్నికల్లో అదే జోష్‌ను కొనసాగించింది. రాష్ట్రవ్యాప్తంగా 95 పుర నగరపాలికల మేయర్, చైర్మన్ పదవులను కైవసం చేసుకోవడం సాధారణ విషయం కాదు. కొత్తగూడెంలో మిత్రపక్షం సీపీఐతో కలిసి అధికారం పంచుకోవడం ద్వారా రాజకీయ సమన్వయాన్ని చాటుకుంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఇంత పెద్ద స్థాయిలో మున్సిపాలిటీలను కాంగ్రెస్ దక్కించుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇది ప్రజలు 'ప్రజా పాలన' ప్రభుత్వంపై వ్యక్తం చేసిన విశ్వాసానికి స్పష్టమైన నిదర్శనం. గ్రామం నుంచి పట్టణం వరకు ఒకే తరహా ప్రజాభిప్రాయం వ్యక్తమవడం రాజకీయంగా గమనించదగ్గ అంశంగా పరిగణించాలి.

ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందుగానే తెలంగాణ కాంగ్రెస్ వ్యూహరచన ప్రారంభమైంది. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు సమన్వయంతో పక్కా ప్రణాళికలు రూపొందించారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఒక మంత్రిని ఇంచార్జిగా నియమించి కమిటీలను ఏర్పాటు చేశారు. ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, స్థానిక నాయకులు అందరూ బాధ్యతగా వ్యవహరించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి జిల్లా వారీగా బహిరంగ సభలు నిర్వహించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ సీఎం జూమ్ ద్వారా నిరంతరం నేతలను అప్రమత్తం చేయడం, వ్యూహాలను వివరించడం పార్టీ అంతర్గత క్రమశిక్షణకు నిదర్శనం. నాయకత్వం, కార్యాచరణ, క్రమబద్ధత అంశాలు విజయానికి మూల సూత్రంగా పని చేస్తేనే సాధ్యమవుతాయని ఈ ఎన్నికలు నిరూపించాయి.

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత నిజామాబాద్ నగర పాలక సంస్థ సహా పలు కీలక మున్సిపాలిటీలను తిరిగి సాధించడం వెనుక స్పష్టమైన వ్యూహం ఉంది. అభ్యర్థుల ఎంపికలో స్థానిక సమీకరణాలు, సామాజిక సమతుల్యతను పరిగణలోకి తీసుకోవడం, క్షేత్రస్థాయిలో అసంతృప్తులను ముందుగానే పరిష్కరించడం వంటి చర్యలు ఫలితాలను ప్రభావితం చేశాయి. ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, రాష్ట్ర కార్యదర్శులు విశ్వనాథన్, సచిన్ లాంటి నాయకులు నిరంతరం పర్యవేక్షణ చేస్తూ పార్టీ పనితీరును మెరుగుపరిచారు. అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత, బూత్ స్థాయి సమన్వయం, సోషల్ ఇంజినీరింగ్ వంటి అంశాలు తెలంగాణ కాంగ్రెస్‌కు విజయసూత్రంగా నిలిచాయి.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ-అభివృద్ధి పథకాలే ఈ విజయానికి ప్రధాన బలం. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం ద్వారా లక్షలాది కుటుంబాలకు ఉపశమనం కలిగింది. రూ.500 గ్యాస్ సబ్సిడీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు వంటి నిర్ణయాలు మధ్యతరగతి, పేదల జీవితాల్లో ప్రత్యక్ష మార్పు తీసుకువచ్చాయి. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాలు గ్రామీణ-పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వానికి మద్దతును బలోపేతం చేశాయి. సంక్షేమం కేవలం ప్రకటనల స్థాయిలో కాకుండా, లబ్ధిదారుల జీవితాల్లో వెలుగునిచ్చే మార్పుగా మారడం ఈ ఎన్నికల్లో ప్రతిఫలించింది.

వ్యవసాయ రంగంలో రైతు రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్ వంటి హామీల అమలు రైతు వర్గం విశ్వాసాన్ని గెలుచుకుంది. రైతు సమస్యలను కేవలం హామీలతో కాకుండా కార్యాచరణతో పరిష్కరించాలనే ప్రభుత్వ దృక్పథం స్పష్టంగా కనిపించింది. యువతకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రుణాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగవంతం చేయడం యువతలో ఆశలను పెంచింది. మహిళా సాధికారిత దిశగా 'ఇందిరా మహిళా శక్తి' పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక బలం కల్పించడం గమనార్హం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ వంటి నిర్ణయాలు సామాజిక న్యాయం పట్ల ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నాయి.

ఇక ప్రతిపక్షాల విషయానికి వస్తే బీఆర్ఎస్, బీజేపీ అవాస్తవాలతో ప్రచారంతో ఎన్నికల రంగంలోకి దిగినా ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకున్నారు. తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పుల భారం, నిరుద్యోగ సమస్యలు, కాళేశ్వరం ప్రాజెక్టు వివాదాలు, ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు ప్రజల్లో అసంతృప్తిని కలిగించాయి. మరోవైపు, కేంద్రంలో పన్నెండేళ్లుగా ఉన్న బీజేపీ తెలంగాణకు తగిన నిధులు ఇవ్వలేదనే భావన బలపడింది. విభజన హామీలు అమలు కాలేదనే విమర్శలు ఎన్నికల్లో ప్రతిఫలించాయి. ప్రజలు ప్రచారానికి కాకుండా అభివృద్ధికి ఓటు వేశారనేది స్పష్టమైంది.

రాజకీయంగా ఈ ఫలితాలు 2028 అసెంబ్లీ, 2029 పార్లమెంట్ ఎన్నికలకు మార్గసూచికగా కనిపిస్తున్నాయి. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, పుర ఎన్నికల్లోనూ ప్రజలు అభివృద్ధికి దిశగా మద్దతు తెలిపారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నుంచి పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల వరకు కాంగ్రెస్‌కు లభిస్తున్న విజయ పరంపర పార్టీ స్థిరత్వాన్ని సూచిస్తోంది. అయితే విజయం అంతిమ గమ్యం కాదని గుర్తించి కొత్త బాధ్యతగా భావించాలి. స్థానిక సంస్థల్లో అధికారాన్ని పొందడం ద్వారా అభివృద్ధి వేగవంతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, పార్టీపై మరింత పెరిగింది. పారదర్శక పాలన, అవినీతి నిరోధక చర్యలు, వనరుల సమర్థ వినియోగం ఇవన్నీ కొనసాగితేనే ప్రజా విశ్వాసం దీర్ఘకాలికంగా నిలుస్తుంది.

మొత్తంగా చూస్తే, తాజా మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో ఒక స్పష్టమైన మార్పుకు సంకేతంగా నిలిచాయి. ఇది కేవలం స్థానిక సంస్థల ఎన్నికల ఫలితం మాత్రమే కాదు ప్రజల మనోభావాలకు ప్రతిబింబం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమన్వయం, పార్టీ శ్రేణుల అంకితభావం కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని విజయాన్ని అందించాయి. ప్రజా ఆశీర్వాదాన్ని నిలబెట్టుకుంటూ ప్రభుత్వం సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తే, ఈ విజయ పరంపర మరింత బలపడడం ఖాయం. ప్రజల విశ్వాసం అన్నది రాజకీయాల్లో అత్యంత విలువైన మూలధనం; ఆ మూలధనాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగితే తెలంగాణ భవిష్యత్తు మరింత దృఢంగా నిలుస్తుంది.



-అమరవాజీ నాగరాజు
టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ

## ఓటమి ఓకే.. కానీ ప్రయత్నించకపోవడం నేరం!

### లెజెండ్ మైఖేల్ జోర్డాన్ సక్సెస్ రూల్

బాస్కెట్‌బాల్ ప్రపంచంలో తిరుగులేని రారాజు, 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (GOAT)గా నీరాజనాలు అందుకునే మైఖేల్ జోర్డాన్ నేడు (ఫిబ్రవరి 17, 2026) తన 63వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఆయన సాధించిన ఆరు ఎన్‌బీఏ (NBA) ఛాంపియన్‌షిప్‌లు, కోర్టులో ఆయన చూపిన అసాధారణ ప్రతిభ ఒక ఎత్తయితే.. తన ఆలోచనా విధానంతో, పని పట్ల అంకితభావంతో ప్రపంచవ్యాప్తంగా తరతరాలకు ఆయన అందించిన స్ఫూర్తి మరో ఎత్తు. ఈ ప్రత్యేక సందర్భంలో, జోర్డాన్ చెప్పిన ఒక శక్తివంతమైన కోట్ గురించి, దాని వెనుక ఉన్న అర్థం గురించి మనం చర్చించుకోవాలి.




**ప్రయత్నమే అసలైన విజయం**

1994లో ఆయన రాసిన 'ఐ కాంట్ యాక్సెప్ట్ నాట్ ట్రైయింగ్' (I Can't Accept Not Trying) అనే పుస్తకంలో, జీవితం, పోటీ పట్ల తన దృక్పథాన్ని వివరిస్తూ ఒక అద్భుతమైన మాట చెప్పారు:

**"నేను ఓటమిని అంగీకరించగలను. ప్రతి ఒక్కరూ ఏదో ఒక విషయంలో విఫలమవుతూనే ఉంటారు. కానీ, ప్రయత్నించకపోవడాన్ని మాత్రం నేను అంగీకరించలేను."**
**- మైఖేల్ జోర్డాన్**

ఈ ఒక్క వాక్యం జోర్డాన్ వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ఓటమి అనేది జీవితంలో ఒక అనివార్య భాగమని, అయితే ప్రయత్నించకుండా వెనకడుగు వేయడమే అసలైన పరాజయమని ఆయన నమ్మారు. బాస్కెట్‌బాల్ కోర్టులో అయినా, వ్యక్తిగత జీవితంలో అయినా సవాళ్లను చూసి భయపడకుండా ముందుకు దూకడమే గొప్పతనం అని ఆయన చాటిచెప్పారు.

**నేటి కాలానికి జోర్డాన్ సూత్రం ఎందుకు అవసరం?**

కేవలం ఫలితాల కోసమే పరిగెత్తే నేటి వేగవంతమైన ప్రపంచంలో, ఫలితం కంటే ప్రయత్నానికే ఎక్కువ విలువ ఇవ్వాలని జోర్డాన్ మాటలు గుర్తుచేస్తున్నాయి. భయం వల్ల ఆగిపోకుండా, తప్పులు జరిగినా పర్లేదని ముందుకు సాగడమే వ్యక్తిగత ఎదుగుదలకు మార్గం. క్రీడలు, చదువు, కెరీర్.. రంగం ఏదైనా సరే, క్రమశిక్షణతో కూడిన నిరంతర ప్రయత్నమే అత్యుత్తమ విజయానికి పునాది వేస్తుంది.

జోర్డాన్ ఫిలాసఫీ ప్రకారం, ప్రతి సవాలు ఒక అవకాశం, ప్రతి అపజయం విజయానికి ఒక నిచ్చెన మెట్టు మాత్రమే.

**మైఖేల్ జోర్డాన్: ఒక అజేయ ప్రస్థానం**

మైఖేల్ జెఫ్రీ జోర్డాన్ (MJ) ఫిబ్రవరి 17, 1963న జన్మించారు. అమెరికన్ వ్యాపారవేత్తగా, రిటైర్డ్ ప్రొఫెషనల్ బాస్కెట్‌బాల్ ప్లేయర్‌గా ఆయన ప్రస్థానం అద్వితీయం.

**కెరీర్:**

1984 నుండి 2003 వరకు 15 సీజన్ల పాటు లీగ్‌లో ఆడారు.

**విజయాలు:**

చికాగో బుల్స్ జట్టు తరపున ఆరుసార్లు ఎన్‌బీఏ ఛాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నారు.

**ప్రభావం:**

బాస్కెట్‌బాల్‌ను ప్రపంచవ్యాప్తం చేయడంలో, ఎన్‌బీఏ పాపులారిటీని ఆకాశానికి చేర్చడంలో ఆయన పాత్ర కీలకం.

**ఆస్తి:**

క్రీడల్లోనే కాకుండా వ్యాపార రంగంలోనూ రాణిస్తున్న ఆయన నికర ఆస్తుల విలువ 2025 నాటికి సుమారు 3.8 బిలియన్ డాలర్లుగా అంచనా. ప్రస్తుతం ఆయన ఎన్‌బీఏలోని 'షార్లెట్ హార్నెట్స్' జట్టులో మైనారిటీ వాటాదారుగా ఉన్నారు.

ఒక క్రీడాకారుడిగా జోర్డాన్ సాధించిన రికార్డులు ఎన్ని ఉన్నా, "ప్రయత్నించడంలో వెనకాడవద్దు" అన్న ఆయన సందేశం మాత్రం ఎప్పటికీ సజీవంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

## మతిమరుపునకు కాఫీతో చెక్..

### తాజా పరిశోధనలో మైండ్ బ్లోయింగ్ విషయాలు

కాఫీ.. ఇది కేవలం ఒక పానీయం మాత్రమే కాదు, కోట్లాది మందికి రోజును ఉత్సాహంగా ప్రారంభించే ఒక ఎనర్జీ డ్రింక్. మధ్యాహ్నం వేళ ఆవరించే కునుకును వదిలించుకోవాలన్నా, పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలన్నా చాలామందికి కాఫీనే మొదటి ఛాయిస్. అయితే, కాఫీ ప్రియులకు ఇప్పుడు సైన్స్ ఒక తీపి కబురు చెప్పింది. రోజూ కాఫీ తాగే అలవాటు ఉన్నవారిలో మతిమరుపు (డిమెన్షియా) వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని తాజాగా ఒక సుదీర్ఘ పరిశోధనలో తేలింది.



**40 ఏళ్ల పరిశోధన..**
**1.3 లక్షల మందిపై అధ్యయనం**

ప్రముఖ వైద్య జర్నల్ 'జామా నెట్‌వర్క్' (JAMA Network) ఈ ఆసక్తికర కథనాన్ని ప్రచురించింది. ఇది ఏదో ఒకట్రెండు రోజులు చేసిన పరిశోధన కాదు.. ఏకంగా 37 ఏళ్ల పాటు సుమారు 1.3 లక్షల మంది ఆరోగ్య అలవాట్లను పరిశీలించి ఈ నిర్ధారణకు వచ్చారు. వయసు పెరిగే కొద్దీ మెదడు పనితీరు మందగించడం, ఆలోచనా సామర్థ్యం తగ్గడం వంటి 'న్యూరో డీజెనరేటివ్' సమస్యలను ఎదుర్కోవడంలో కెఫీన్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. ప్రముఖ శాస్త్రవేత్త, వైద్య నిపుణులు డాక్టర్ ఎరిక్ టోపోల్ ఈ పరిశోధన ఫలితాలను విశ్లేషిస్తూ ఒక కీలక పోస్ట్ చేశారు.

"కెఫీన్ కలిగిన కాఫీ లేదా టీ తాగే వారిలో మెదడు చురుకుదనం మెరుగ్గా ఉండటమే కాకుండా, మతిమరుపు ముప్పు కూడా తగ్గింది. ముఖ్యంగా రోజుకు సుమారు రెండు కప్పుల కాఫీ తాగే వారిలో ఈ సానుకూల మార్పులు స్పష్టంగా కనిపించాయి" అని ఆయన వివరించారు.

**అన్ని కాఫీలు ఒకేలా పనిచేస్తాయా?**

ఈ అధ్యయనంలో ఒక ఆసక్తికరమైన విషయాన్ని పరిశోధకులు వెల్లడించారు. ఈ ప్రయోజనాలన్నీ కేవలం 'కెఫీన్' ఉన్న కాఫీ లేదా టీ తాగినప్పుడే కనిపిస్తాయి. కెఫీన్ లేని (Decaffeinated) కాఫీ తాగిన వారిలో ఇలాంటి మార్పులేవీ కనిపించలేదు. కాఫీ తాగని వారితో పోలిస్తే, రోజూ పరిమితంగా తాగే వారికి జ్ఞాపకశక్తి సమస్యలు తక్కువగా ఉన్నాయని, వారు కాగ్నిటివ్ పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచారని ఈ నివేదిక చెబుతోంది.

**అతి సర్వత్ర వర్జయేత్**

కాఫీ మంచిది కదా అని గంటకో కప్పు తాగేస్తే ప్రయోజనం ఉండదు, పైగా.. అది నష్టం కలిగిస్తుంది. ఏదైనా పరిమితంగా ఉన్నప్పుడే దానికి విలువ. రోజుకు రెండు లేదా మూడు కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగడం వల్ల అదనపు ఆరోగ్య ప్రయోజనాలేమీ ఉండవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాఫీని ఒక 'మ్యాజిక్ మందు'లా కాకుండా, ఒక ఆరోగ్యకరమైన అలవాటుగా మాత్రమే చూడాలి.

**మెదడు ఆరోగ్యానికి కాఫీ ఒక్కటే సరిపోదు**

మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం కాఫీ తాగితే సరిపోదని, జీవనశైలిలో మార్పులు కూడా ముఖ్యమని నెటిజన్లు సైతం అభిప్రాయపడుతున్నారు. దీనిపై ఒక నిపుణుడు స్పందిస్తూ.. "మీకు మెదడు రక్షణ కావాలంటే వ్యాయామం చేయండి, నడవండి, కంటినిండా నిద్రపోండి, బలమైన ఆహారం తీసుకోండి. వీటితో పాటు బోనస్‌గా రోజుకు 12 కప్పుల కాఫీని ఆస్వాదించండి" అని సూచించారు.

సరైన నిద్ర లేకపోయినా, జంక్ ఫుడ్ ఎక్కువగా తిన్నా, రోజంతా సోషల్ మీడియాలో మునిగితేలుతూ శారీరక శ్రమ చేయకపోయినా.. ఎన్ని కప్పుల కాఫీ తాగినా మెదడును కాపాడుకోలేమని గుర్తించాలి. కాఫీ అనేది మీ ఆరోగ్య ప్రయాణంలో ఒక చిన్న తోడు మాత్రమే, అది పూర్తి పరిష్కారం కాదు.

# నల్గొండ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం

**తుప్పు పడుతున్న పేదవాడి ఆశ రూ.50 లక్షల ప్రజాధనం తుప్పు కుప్పేనా.. నల్గొండ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట..**

**గాలికొదిలేసిన 'ప్రే ఫ్యాబ్రికేటెడ్' షాపులు.. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వీధి వ్యాపారుల పొట్టకొట్టి..**



**నల్గొండ మహా బ్యూరో :** పాలకుల పట్టింపులేమి అధికారుల ఉదాసీనత వెరసి ప్రజాధనం నట్టేట మునుగుతోంది. వీధి వ్యాపారుల జీవనోపాధి కోసం లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆధునిక దుకాణాలు నేడు పాత ఇనుము (స్క్రాప్) గా మారుతున్నాయి. నల్గొండ పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఒక మంచి ఉద్దేశం.. రాజకీయ చదరంగంలో చిక్కుకుని చివరకు పాత టౌన్ హాల్ ఆవరణలో ఎండకు ఎండుతూ, వానకు నానుతూ చిలుము పడుతోంది. సుమారు ₹50 లక్షల విలువైన ఈ ఆస్తిని కాపాడటంలో మున్సిపల్ యంత్రాంగం ఘోరంగా విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నల్గొండ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా అద్దంకి బైపాస్ రోడ్డు నుండి పట్టణ ప్రధాన రహదారి వరకు విస్తరణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో ఉపాధి కోల్పోయిన వీధి వ్యాపారులను ఆదుకోవాలనే లక్ష్యంతో మున్సిపాలిటీ అధికారులు ఎన్.జి. కళాశాల సమీపంలో 25 'ప్రే ఫ్యాబ్రికేటెడ్' దుకాణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో దుకాణానికి దాదాపు ₹2 లక్షల చొప్పున మొత్తం ₹50 లక్షలు వెచ్చించి, అన్ని హంగులతో వీటిని సిద్ధం చేశారు. ప్రాథమికంగా 25 మంది లబ్ధిదారులను గుర్తించినప్పటికీ, దురదృష్టవశాత్తు అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో కేటాయింపు ప్రక్రియ అర్ధాంతరంగా ఆగిపోయింది.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత, 2024 జనవరిలో మున్సిపల్ అధికారులు ఈ ప్రక్రియపై స్పందించారు. ఒక కమిటీని వేసి లక్కీ డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఆ మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు.. ఈ దుకాణాలు వ్యాపారానికి అనువుగా లేవనే కుంటిసాకుతో 2025 మార్చి 16న వాటిని అక్కడి నుండి తొలగించి పాత టౌన్ హాల్ కాంపౌండ్ లో పడేశారు. ఆ సమయంలో అప్పటి మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ వీటిని వృథా చేయకుండా పట్టణంలోని అన్ని వార్డులలో వార్డు ఆఫీసర్ల కార్యాలయాలుగా వినియోగిస్తామని హామీ ఇచ్చారు. కానీ 11 నెలలు గడుస్తున్నా ఆ హామీ అమలుకు నోచుకోలేదు.కనీసం ఈ ఖరీదైన దుకాణాలను ఏదైనా షెడ్డు కింద భద్రపరిస్తే పాడవకుండా ఉండేవని, కానీ బహిరంగ ప్రదేశంలో పడేయడం వల్ల వర్షాలకు తడిసి ఇనుము పూర్తిగా తుప్పు పడుతోందని స్థానిక వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రకాశం బజార్ లో జరిగిన రోడ్డు విస్తరణలో అనేకమంది వీధి వ్యాపారులు మళ్లీ ఉపాధి కోల్పోయారు. కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి మూలన పడి తుప్పు పడుతున్న ఈ దుకాణాలను ఆ బాధితులకు కేటాయిస్తే ప్రజాధనం సద్వినియోగం కావడంతో పాటు పేదలకు నీడ దొరుకుతుందని పట్టణ వాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఈ ₹50 లక్షల ఆస్తి కేవలం పనికిరాని ఇనుప ముక్కలుగా మిగిలిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

## రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలపై దాడులు జరిగితే వాటిని తీవ్రంగా పరిగణిస్తాం..

తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్..



**నాగర్ కర్నూలు జిల్లా మహా:** మంగళవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్లు రాపోలు జయప్రకాశ్, టీ.సురేందర్, బాలలక్ష్మి, సభ్యులతో కలిసి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ గ్రామాన్ని సందర్శించి, ఘటన జరిగిన శ్రీ మల్లికార్జున స్వామి వారి దేవాలయ వద్ద జరిగిన ఘటన ప్రదేశాన్ని సందర్శించి అక్కడ జరిగిన వివరాలను కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులతో చిన్నారి ఘటన జరిగిన పూర్వాపరాల వివరాలపై ఆరా తీశారు. ఘటన జరుగుతున్న సందర్భంగా హోంగార్డు చిత్రీకరించిన వీడియోను డి.ఎస్.పి బురి శ్రీనివాసులు వీడియోను ఫోస్లో కమిషన్ చైర్మన్ కు చూపించారు. గ్రామంలో రెండు నెలల చిన్నారి సమాధిని సందర్శించి సమాధి వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. తదనంతరం చిన్నారి తల్లిదండ్రులు గణేష్ మౌనికల ఇంటిని సందర్శించినారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, మాట్లాడుతూ... మల్లన్న జాతరకు సుమారుగా 10,000 మంది భక్తులు వచ్చారని అధికారులు తమ దృష్టికి తెచ్చినట్లు ఆయన తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా మండల పరిధిలోని కొమ్మెర ఘటనను రాష్ట్ర బీసీ కమిషన్ అత్యంత ప్రాధాన్యత తీసుకున్నట్లు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, దేవాదాయ శాఖను పూర్తిస్థాయిలో నివేదికను సమర్పించాలని కోరినట్లు తెలిపారు. నివేదికలు అందిన తర్వాత ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ తరపున సమగ్ర నివేదికను పంపనున్నట్లు కమిషన్ చైర్మన్ నిరంజన్ ఈ సందర్భంగా వెల్లడించారు. బడుగు, బలహీన వర్గాల హక్కులను రక్షించడం కమిషన్ బాధ్యత అని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిందితులు ఎంతటి వారినైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల రాష్ట్ర బీసీ కమిషన్ అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. దోషులను ఎంతటి వారైనా చట్టపరంగా కఠినంగా శిక్షించాల్సిందేనని, పోలీసులు పారదర్శకంగా దర్యాప్తు చేసి నిజానిజాలను వెలికితీయాలని ఆయన ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కులవివక్షకు వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలని, సమాజంలో సమానత్వ భావన పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పిలుపునిచ్చారుఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ గత మూడు రోజులుగా జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను రాష్ట్ర బీసీ కమిషన్ దృష్టికి వివరంగా తీసుకువచ్చారు.

## జగన్మోహిని అలంకార సేవలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారు



**యాదగిరిగుట్ట, మహా:**ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి...మంగళవారం ఆరవ రోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం జగన్మోహిని అలంకార సేవలో భక్తులకు దర్శనమిచ్చాడు యాదగిరిశుడు...రాత్రి లక్ష్మీ నరసింహుడిని అశ్వ వాహన సేవ పై ఊరేగించి ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించనున్నారు ఆలయ అర్చకులు...జగన్మోహిని అలంకార సేవపై ఆలయ తీరు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశాడు స్తంభోద్భవుడు...ఆలయ తూర్పు గోపురం ముందు జగన్మోహిని అలంకార సేవను అధిష్టింపజేసి పూజలు నిర్వహించారు...అలంకార సేవ విశిష్టతను భక్తులకు తెలియజేశారు ఆలయ అర్చకులు...ప్రత్యేకంగా తెప్పించిన పూలతో లక్ష్మీ నరసింహుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు...వేద మంత్రాలు,మంగళ వాయిద్యాలు,ఇతిహాస,పారాయణల నడుమ నయన మనోహరంగా లక్ష్మీ నరసింహుడి అలంకార సేవ ఊరేగింపు జరిగింది...

## పిఓడబ్ల్యూ (విముక్తి) కరపత్రాల ఆవిష్కరణ

- **మార్చి-8 శ్రామిక మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి**
- **పెర్క సునీత పిలుపు**



**కుషాయిగూడ, మహా :** అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని పిఓడబ్ల్యూ (విముక్తి) రెండు తెలుగు రాష్ట్రాల కన్వీనర్ పెర్క సునీత పిలుపునిచ్చారు. మార్చి 8 నుండి 30 వరకు ఆదివాసి మహిళల జీవితాలను దెబ్బతీస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. మంగళవారం బాలాజీనగర్లో నందిని అధ్యక్షతన నిర్వహించిన పిఓడబ్ల్యూ (విముక్తి) కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఇఫ్టూ జాతీయ కన్వీనర్ షేక్ షావలి, పివైఎల్ రాష్ట్ర కన్వీనర్ బానోత్ సంతోష్నాయక్, తెలంగాణ కళాకారుల వేదిక రాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొట్టడం, కులవివక్షతో అమానుష ఘటనలకు పాల్పడడం వంటి చర్యలను ఖండించారు. ఇటువంటి ఘటనలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం, స్త్రీ-పురుష సమానత్వం సాధన కోసం మహిళలు సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మార్చి 8ను హక్కుల సాధన కోసం ఐక్య సందేశ దినంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో పద్మ, సులోచన, మంగా తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మెర గ్రామంలో పెత్తందార్ల దాడులు నిరసిస్తూ దిష్టిబొమ్మ దగ్ధం



**నాగర్ కర్నూలు జిల్లా మహా :** ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు మాట్లాడుతూ నాగర్ కర్నూల్ మండలం కుమ్మర గ్రామంలో ఫిబ్రవరి 18న దళిత రజక కుటుంబం పై దాడి జరిగి రెండు నెలల చిన్నారి మృతి చెంది ఆరు రోజులు గడుస్తున్న ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని కేవలం ముగ్గురిని అరెస్టు చేసి మిగతా నిందితులను అరెస్టు చేయకుండా ఉండటం వలన ప్రజా పాలనలో పెత్తందారుల దాడులు దౌర్జన్యాలు పెరిగిపోవడానికి నిదర్శనంగా ఉన్నాయని విమర్శించారు. నాగర్ కర్నూల్ ఎంపీ ఎమ్మెల్యే మరియు జిల్లా ప్రభుత్వ అధికారులు తక్షణమే కుమ్మర గ్రామాన్ని సందర్శించి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి అంటరానితనం వివక్షకు వ్యతిరేకంగా ప్రభుత్వ తరపున చైతన్య కార్యక్రమాలు తీసుకోవాలని, అదేవిధంగా బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వ పరంగా ప్రభుత్వ ఉద్యోగం కోటి రూపాయల ఎక్స్ఫ్రేషియా చెల్లించాలని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి న్యాయాభిచారన్నారు తొందరగా చేపట్టి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పొదిలి రామయ్య తారా సింగ్, నాగపూర్ మధు, అంతటి కాశన్న, సురేష్, కుర్మయ్య, వెంకటేష్ కొత్త మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ ను రద్దు చేయాలని రాస్తారోకో



**వలిగొండ, మహా :** యూరియా యాప్ ను రద్దు చేయాలని వలిగొండ మండల కేంద్రంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంక ట్ రెడ్డి రాస్తారోకోను ఉద్దేశించి మాట్లాడుతూ. ప్రభుత్వం యూరియా యాప్ పేరుతో రైతులను మోసం చేస్తుందని అన్నారు వెంటనే యూరియా యాప్ ను రద్దు చేయాలని అన్నారు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే యూరియా నిల్వలు ఉంచి రైతులకు యూరియా అందించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు

## రాజ్యసభకు ఆదివాసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**పోడెం వీరయ్య పేరును పరిశీలించాలి.. డా. సాగబోయిన పాపారావు విజ్ఞప్తి**



**కుషాయిగూడ, మహా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ప్రజా పాలన - ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతున్న నేపథ్యంలో త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో ఆదివాసీలకు ప్రాధాన్యత కల్పించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు డా. సాగబోయిన పాపారావు ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన సీనియర్ ఆదివాసి నాయకుడు, మాజీ భద్రాచలం శాసనసభ్యుడు, ప్రస్తుత అటవీ అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు పోదెం వీరయ్య పేరును మొదటి ప్రాధాన్యతగా పరిగణించాలని సూచించారు. తరతరాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిబద్ధతతో పనిచేస్తున్న నాయకుడిగా వీరయ్యను గుర్తించాలని పేర్కొన్నారు. అలాగే ఆదివాసి యోధుడు కొమురం భీం నినాదమైన 'జల్, జంగల్, జమీన్' స్ఫూర్తిని ప్రజల్లో వ్యాప్తి చేస్తున్న ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కకు కూడా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 79 ఏళ్లలో ఆదివాసి తెగల నుంచి పెద్దల సభకు తగిన ప్రాతినిధ్యం లభించలేదని ఆయన అన్నారు. ఈసారి రాజ్యసభకు ఆదివాసీలను పంపించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ చరిత్ర సృష్టించాలని ఆదివాసి ప్రజలు ఆశిస్తున్నారని పేర్కొన్నారు. షెడ్యూల్ ఏరియా ప్రాంతాల్లో కాంగ్రెస్ విజయాల్లో ఆదివాసి ప్రజల పాత్ర కీలకమని, వారి విశ్వాసానికి అనుగుణంగా నిబద్ధత కలిగిన నాయకులకు రాజ్యసభ అవకాశం కల్పించాలని డా. పాపారావు విజ్ఞప్తి చేశారు.

## పసికందు మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి



**నల్లగొండ మహా :** నాగర్కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో అగ్రకుల దురహంకారంతో బీసీ కుటుంబంపై జరిగిన దాడిని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ యూత్ జేఏసీ చైర్మన్ కట్టెకోలు దీపెందర్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనలో రెండు నెలల పసికందు మరణించడం అత్యంత బాధాకరమని నిందితులపై తక్షణమే హత్య కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

**అమానుష దాడి.. ప్రాణం తీసిన దురహంకారం..**

"ఆరు రోజుల క్రితం కుమ్మెర గ్రామంలోని మల్లన్న గుడిలోకి టికెట్ లేకుండా ప్రవేశించారనే నెపంతో చాకలి కులానికి చెందిన గణేష్, చంద్రకళ, మౌనికలపై స్థానిక సర్పంచ్ తుకారం రెడ్డితో పాటు సతీష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి మరికొందరు కలిసి విచక్షణారహితంగా దాడి చేశారు. రాయలేని భాషలో దూషిస్తూ అమానుషంగా ప్రవర్తించారు. ఈ దాడి కారణంగానే రెండు నెలల పసిపాప ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని దీపెందర్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సంఘం తరపున ఆయన ప్రభుత్వాన్ని పలు డిమాండ్లు చేశారు.. పసికందు మరణానికి కారణమైన వారిపై సెక్షన్ 302 కింద హత్య కేసు నమోదు చేయాలని, తక్షణమే నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటిస్తూ, బాధితులకు తక్షణమే పోలీస్ భద్రత కల్పించాలన్నారు .ఈ సమావేశంలో బీసీ యువజన సంఘం నల్లగొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు విశ్వనాథుల శివకుమార్, నిరుద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ పాల్వాయి రవి, కొడదల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేల



**సంగారెడ్డి ప్రతినిధి: మహా :**సదాశివపేట మండలంలోని తంగడపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా మంగళవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అయిన విద్యార్థులు విద్యార్థులకు పాఠాలు బోధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని,భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తి లో వెళ్తామని తెలియజేశారు.మండల విద్యాధికారిగా కారుణ్య,ప్రధానోపాధ్యాయులు గా మణిదీప్,ఉపాధ్యాయులుగా అవంతిక,గౌరీ శ్రీ, సింధూజ,హర్షిత,కార్తీక్,మనోజ్, వ్యవహరించారు... ఈ కార్యమంలో ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్ ,ఉపాధ్యాయులు సంతోష, పాల్గొన్నారు..

## ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**నేటి నుంచి పరీక్షలు.. హాజరుకానున్న 351 విద్యార్థులు**




**మహా దుమ్ముగూడెం:** నేటి నుంచి మార్చి 14వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ సార్వత్రిక పరీక్షలు మండలంలోని దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించే పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండలానికి చెందిన దుమ్ముగూడెం జూనియర్ కళాశాల,కస్తూర్బా గాంధీ , టెక్నో వొకేషనల్ కళాశాలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షల్లో 215 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 163 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. మొదటిసారిగా పరీక్షలు సీసీ కెమెరాలు నిర్వహణలో జరుగుతున్నావని, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం త్రాగునీరు, విద్యుత్తు ఇబ్బందులు మరుగుదొడ్ల సౌకర్యం కల్పించినట్లు పరీక్షల నిర్వహణలో అధికారి కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ కృష్ణవేణి తెలిపారు.ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్ష రాయడం పూర్తి చేసినా పరీక్ష సమయం ముగిసిన తర్వాతనే బయటకు పంపిస్తారు. గతంలో ఉన్నటువంటి ఒక నిముషం ఆలస్యాన్ని ఐదు నిమిసాలకు సడలింపు చేసామని అన్నారు. పరీక్ష నిర్వహణలో డిపార్ట్మెంటల్ అధికారిగా సత్యేంద్ర కుమారు నియమించినట్లు, పరీక్ష కేంద్రానికి చుట్టుపక్కల 100 మీటర్ల దూరంలో ఎవరికి అనుమతి లేదని 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అన్నారు.

## సింగరేణి కార్మికుల వసతి గృహాలకు మౌలిక సదుపాయాలు కల్పించండి



**ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు**

**సత్తుపల్లి, మహా:** సింగరేణి సత్తుపల్లి ఏరియా జలగం వెంగళరావు, కిష్టారం ఉపరితల గనుల కార్మికులు నివసించే గృహ సముదాయాలలో మౌనిక సదుపాయాలు కల్పించాలని ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ కు ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ బి.కోటేశ్వరరావు వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జే.వి.ఆర్ ఓ.సి శైలో బంకర్ ప్రైవేటీకరణ కావడంతో ఆ ప్రాంత కార్మికులను జే.వి.యర్ ఓ.సి1, ఓ.సి2 లలో సర్దుబాటు చేయాలని జనరల్ మేనేజర్ శ్రీనివాస్ ను కోరారు. గనుల పునరుద్ధీకరణలో భూములు కోల్పోయి సింగరేణి సంస్థలో ఔట్సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న డిఎల్ఆర్ ల వేతనాలు, మాస్టర్ల పెంపు పై వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు జనరల్ మేనేజర్ తో చర్చించారు. ఈ విషయంపై స్పందించిన జనరల్ మేనేజర్ శ్రీనివాస్ కార్మికుల వినతులు పరిశీలించి త్వరలోనే తగిన చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కార్యదర్శి రామారావు, డీలర్ ఇన్ఛార్జ్ మురళీకృష్ణ, కిష్టారం ఫిట్ సెక్రెటరీ బాలాజీ, సీతారామరాజు, తిరుమల్ రావు, షఫక్ బాబు, రాజేందర్, శ్రీధర్, సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేయాలి

**అధికారులకు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశం..**



**నల్లగొండ టౌన్ మహా :** జిల్లాలో వచ్చే నెల 14 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను అత్యంత పారదర్శకంగా, సవ్యంగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్లో పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించిన ఆయన పరీక్షల ఏర్పాట్లపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.మార్చి 14న ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 16 వరకు కొనసాగుతాయని ప్రతి రోజూ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అదనపు కలెక్టర్ వివరించారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ మరియు ప్రైవేట్ విద్యార్థులు కలిపి మొత్తం 19,835 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. వీరి కోసం జిల్లాలో మొత్తం 109 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ఈసారి 5 నిమిషాల వెసులుబాటు కల్పించిందని అయితే ఆ సమయం దాటిన తర్వాత వచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్ష కేంద్రంలోకి అనుమతించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు 163 బి.ఎన్.ఎస్.ఎస్. అమలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పరీక్ష కేంద్రాల్లోకి సెల్ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు, ఇతర గ్యాడ్జెట్లను అనుమతించబోమని విద్యార్థుల వస్తువుల భద్రత కోసం ప్రతి కేంద్రం వద్ద ప్రత్యేకంగా క్లాక్ రూమ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. మాస్ కాపీయింగ్ను నిరోధించేందుకు పకడ్బందీగా ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు జరిగే రోజుల్లో కేంద్రాల పరిసరాల్లోని జిరాక్స్ సెంటర్లను మధ్యాహ్నం 1:00 గంట వరకు తప్పనిసరిగా మూసి ఉంచాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## జవహర్ నగర్ కు తొలగనున్న అదనపు డంపింగ్ భారం

**మినీ డంపింగ్ యార్డుల కోసం ప్రభుత్వం వేట**



**కుషాయిగూడ, మహా :** గ్రేటర్ మున్సిపాలిటీల విలీనం చివరకు జవహర్ నగర్ పాలిట శాపంగా పరిగణించింది. హైదరాబాద్ సిటీ నుండి రోజుకు దాదాపుగా 8 వేల మెట్రిక్ టన్నుల చెత్త జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కు చేరుతుండగా కొత్త ప్రాంతాల నుండి వస్తున్న 1500 టన్నుల అదనపు భారంఈ జవహర్ నగర్ ను ఊపిరి తీసుకోనివ్వడం లేదని జవహర్ నగర్ వాసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నరకం నుండి జవహర్ నగర్ వాసులకే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాలైన దమ్మాయిగూడ, నాగారం, అహమ్మద్ గూడా, చీర్యాల్, తదితర ప్రాంతాల ప్రజలకు విముక్తి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకరణ బాట పట్టింది. శివారు ప్రాంతాల్లో కొత్త డంపింగ్ యార్డ్ ల కోసం వేట మొదలు పెట్టింది.

## పోలీసు క్రీడల్లో నల్లగొండ సిబ్బంది మెరుపులు

**విజేతలను అభినందించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్**



**నల్లగొండ మహా :** రాష్ట్రస్థాయిలో నిర్వహించిన 4వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ -2026లో నల్లగొండ జిల్లా పోలీస్ సిబ్బంది అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. ఈ నెల 16 నుంచి 21 వరకు హైదరాబాద్లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా జరిగిన ఈ క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన పలువురు సిబ్బంది వివిధ విభాగాల్లో మెడల్స్ సాధించి జిల్లా పోలీస్ శాఖ ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ విజేతలను ప్రత్యేకంగా అభినందించారు.క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన సిబ్బందిని ఎస్పీ ప్రశంసిస్తూ వారికి మెడల్స్ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం విధులతో బిజీగా ఉండే పోలీసులు ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. విధుల్లోనే కాకుండా క్రీడల్లోనూ రాణించి జిల్లాకు గర్వకారణంగా నిలిచినందుకు సంతోషం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో వీరు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మరింత ప్రతిభ కనబరచాలని అందుకు జిల్లా పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం ఉంటుందని ఆకాంక్షించారు. ముఖ్యంగా యాదాద్రి జోన్ పరిధిలోని వివిధ విభాగాల సిబ్బంది సత్తా చాటడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# రూ.60 లక్షలతో సైడ్ డ్రైన్ నిర్మాణం..

- **గోల్డ్ షాప్ లైన్ నుంచి పల్లె దవాఖాన వరకు నిర్మాణం..**
- **భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం..**

**మణుగూరు, మహా :** మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు మరో అడుగు పడింది. గోల్డ్ షాప్ లైన్ నుంచి పల్లె దవాఖాన వరకు సుమారు రూ.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సైడ్ డ్రైన్ పనులకు మంగళవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలుగా ఈ డ్రైన్ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. కాలుష్యం తగ్గించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ఈ పనులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ టి ప్రసాదరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ కే సత్య, వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, ఎలక్ట్రిషన్ రమేష్, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, సమితి సింగారం ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, మైనారిటీ అధ్యక్షుడు రహీం పాషా, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలమూరి రాజు, ఎస్ గణేష్ రెడ్డి, పాతూరి వెంకన్నతో, పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

# యూత్ కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్ట్ ఖండిస్తున్నాం...

**మాజీ సర్పంచ్ వరలక్ష్మి**



**మహా దుమ్ముగూడెం:** ఇండియన్ యూత్ కాంగ్రెస్ నాయకుల కార్యకర్తలపై జరిగిన అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని వారిని వెంటనే విడుదల చేయాలని పర్ణశాల మాజీ సర్పంచ్ కాంగ్రెస్ మహిళ నాయకురాలు తెల్లం వరలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని పర్ణశాల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఇలాంటి అరెస్టులకు చోటు లేదని ప్రశ్నించడం నిరసన తెలపడం వారి మౌలిక అక్కని హక్కులను అణిచివేయడానికి అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ప్రజల హక్కుల కోసం చేర్చ కోసం పోరాడిందని దానికి అనుగుణంగానే మేము ప్రజాస్వామ్య కాపాడుతున్నామని తెలిపారు. అరెస్ట్ అయిన యువ నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తెల్లం హరికృష్ణ మాజీ ఎంపీటీసీ భీమరాజు మాజీ ఉపసర్పంచ్ సవలం భద్రయ్య నరసింహారావు యూత్ నాయకులు భరత్ సందీప్ రామ్ చరణ్ సంతోష్ మహిళా నాయకురాలు శైలజ ప్రియాంక సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యారంగ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**టిపిటిఎఫ్ డిమాండ్**



**మహా దుమ్ముగూడెం:** గిరిజన సంక్షేమ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టి పి టి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుటారి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్లగూడెం ఆశ్రమ పాఠశాలలో శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పండిట్ పోస్టులను అప్డేట్ చేసి సిఆర్టి డైలీ వర్కర్లను రెగ్యులర్ చేయాలని అధికారులకు సంబంధిత శాఖ మంత్రికి తెలియజేసిన ప్రభుత్వం పట్టించుకోలేదని దీనిలో భాగంగానే రేపటినుండి రెండో దశ పోరాట కార్యక్రమాలు అధికారులకు వినతి పత్రాలు అందించడం జరుగుతుందని అన్నారు. సమస్యల పరిష్కారం కొరకు ఈనెల భద్రాచలం ఐటిడిఏ ఎదుట మార్చి 10న కమిషనర్ కార్యాలయం హైదరాబాద్ ఎదుట టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సోమశేఖర్ మండల ప్రధాన కార్యదర్శి బి రవి అధ్యక్షులు కే వెంకటేశ్వర్లు జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ రామచంద్ కౌన్సిలర్ లక్ష్మయ్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయిలో రాణించడం గర్వకారణం

**కాంస్య పతకం సాధించిన హాసిని అభినందించిన కలెక్టర్**



**మహా దుమ్ముగూడెం:** సీఎం కప్ పోటీలలో రాష్ట్ర స్థాయిలో రాణించడం జిల్లాకు గర్వకారణం అని భద్రాది కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. హైదరాబాదులో జరిగిన సీఎం కప్ రెండో ఎడిషన్ రాష్ట్ర స్థాయి పోటీలలో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో జిల్లాకు రెండు పథకాలు వరించాయని వారిలో 86 కేజీల బాలికల విభాగంలో దుమ్ముగూడెం మండలం పెదనలబల్లి గ్రామానికి చెందిన నక్క హాసిని కాంస్య పథకం సాధించగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పథకం సాధించిన క్రీడాకారిని హాసిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థినితో తెలుపుతూ.. తను కూడా వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడుని అని భవిష్యత్తులో మరింతగా రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని వెయిట్ లిఫ్టింగ్ పోటీల కొరకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తనవంతు సహాయం అందిస్తానని కలెక్టర్ విద్యార్థినికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి పరంధామిరెడ్డి ఎస్ డి ఎఫ్ సెక్రెటరీ నరేష్ కోచ్ చైతన్య మేనేజర్ విజయకుమార్ తల్లిదండ్రులు నక్క సిల్వ కుమార్ ,సునీత తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు అటవీశాఖపై ఆగ్రహం..

- **ఇసుక మాఫియా కోసమే అడవి నరికివేత..**
- **28న ఎఫ్‌డీఓ కార్యాలయ ముట్టడి ..**
- **ఆదివాసీ నేత కోటి..**



**మణుగూరు, మహా :** అడవులను రక్షించాల్సిన అటవీ శాఖ అధికారులే అడవిని భక్షిస్తున్నారని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అలెం కోటి తీవ్ర ఆరోపణలు చేశారు. ఇసుక ర్యాంపుల కోసం నిబంధనలను తుంగలో తొక్కి వేలాది చెట్లను అక్రమంగా నరికివేశారని విమర్శించారు. మంగళవారం మణుగూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. అడవులు ఆదివాసీల జీవనాధారమే కాకుండా వారి సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీకలని తెలిపారు. పేదవాళ్లు కట్టెలు కొట్టుకున్నా, పశువులను అడవిలో మేపుకున్నా కేసులు నమోదు చేసే అటవీ అధికారులు, ఇసుక కాంట్రాక్టర్ల కోసం అడవిని నాశనం చేసే హక్కు వారికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. అడవుల నాశనం భవిష్యత్ తరాలకు తీవ్ర ముప్పు కలిగిస్తుందని హెచ్చరించారు. అటవీశాఖ అధికారుల అక్రమాలను ఎండగట్టేందుకు ఈ నెల 28న మణుగూరు ఎఫ్‌డీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి అఖిలపక్షాలు, ఆదివాసీ సంఘాలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గురిజాల గోపి మాట్లాడుతూ, తప్పుడు నివేదికలతో ప్రభుత్వాన్ని, కోర్టులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మణుగూరు ప్రజలను కూడా మోసం చేసి ప్రాంతాన్ని ఆక్రమిస్తారా?" అని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ సంఘాలు పెద్దఎత్తున ముట్టడిలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ మాట్లాడుతూ, బడా బాబుల ఇసుక ర్యాంపుల కోసం పచ్చని చెట్లను నరికి, అడవిలో నివసించే జంతువులను నిరాశ్రయులుగా మార్చారని ఆరోపించారు. బాధ్యులైన అటవీశాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 28న జరిగే ముట్టడిలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు ఎండి షబానా, కోరి శ్యామల, కన్నాపురం వసంత, దేరంగుల సుజాత, రెడ్డి బోయిన రేణుక, కన్నాపురం శైలజ, లక్కింశెట్టి హేమలత తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం ఇక క్యూ లైన్లు లేవు..

- **ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌తో రైతులకు సౌలభ్యం..**
- **కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యవసాయ శాఖ కృతజ్ఞతలు..**



**మణుగూరు, మహా :** తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులు యూరియా బస్తాలను సులభంగా బుక్ చేసుకుంటూ సంతోషంగా ఉన్నారని జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబురావు తెలిపారు. గతంలో యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిందన్నారు.మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ కార్యాలయంలో రైతులకు యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ జిల్లాలోని 23 సొసైటీలలో యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. మణుగూరులో ఒక రైతు ఏకంగా 16,500 యూరియా బస్తాలను యాప్ ద్వారా బుక్ చేసుకున్నారని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు యూరియా సరఫరాపై పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఏడిఏ తాతారావు మాట్లాడుతూ గతంలో యూరియా పంపిణీ సమయంలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారేవని, పోలీస్ బందోబస్తు కూడా అవసరమయ్యేదని గుర్తుచేశారు. ప్రస్తుతం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త కృషితో రూపొందించిన యాప్ ద్వారా రైతులు ఇంటి వద్ద నుంచే బుకింగ్ చేసుకునే అవకాశం లభించిందన్నారు. రైతాంగం తరపున, వ్యవసాయ శాఖ తరపున ఈ వినూత్న యాప్ తీసుకువచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ రైతులు యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ సీఈఓ నవీన్ కూడా యాప్ ద్వారా పారదర్శకంగా యూరియా బుకింగ్ జరుగుతోందని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వేల్పుల బాబురావు, ఏడిఏ తాతారావు, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారి లక్ష్మణరావు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ సీఈవో నవీన్, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. యాప్ వినియోగంపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# ఐ.ఎల్.పీ.ఏ రాష్ట్ర మహిళా సదస్సును జయప్రదం చేయండి

**బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఈనెల 28వ తేదీన హైదరాబాద్ లో జరుగు ఇండియాన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఐ.ఎల్.పీ.ఏ రాష్ట్ర మహిళా సదస్సును జయప్రదం చేయాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ కోరారు. మంగళవారం జిల్లా కోర్టు లైబ్రరీ హాల్ నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఇచ్చిన పిలుపులో భాగంగా బ్లాక్ కోట్స్ ఫర్ బ్లూ రెవల్యూషన్ మహిళా న్యాయవాదుల హక్కులు సమస్యలపై చర్చ ఉంటుందన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మహిళ న్యాయవాదులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సామాజిక ఆర్థిక సమస్యలపై వివరించడం జరుగుతుందన్నారు. అట్టడుగు వర్గాల న్యాయవాదులను విద్య ద్వారా మాత్రమే విముక్తి చేయాలనే లక్ష్యంతో 365 రోజులు ఆన్లైన్ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని జూనియర్ సివిల్ జడ్జ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న న్యాయవాదులకు నిరంతరంగా అందిస్తున్న ఏకైక న్యాయవాద సంస్థ ఐ.ఎల్.పీ.ఏ నిలుస్తోందని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే, బాబాసాహెబ్ డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ భావజాలాన్ని ఆధారంగా చేసుకొని సమానత్వం న్యాయం సామాజిక చైతన్యాన్ని లక్ష్యంగా పెట్టుకొని మహిళ న్యాయవాదుల మధ్య అవగాహన పెంచుతూ వృత్తిలో వెనుకబడిన వర్గాలకు దిశానిర్దేశం చేసే ఈ రాష్ట్ర మహిళా మహాసభకు అందరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎల్.పీ.ఏ సభ్యులు పోసాని రాధాకృష్ణ, జే.గోపికృష్ణ, యెర్రా కామేష్, ఎర్రపాటి కృష్ణ, ఉట్ల రాజేశ్వరరావు, అంబటి రమేష్, మారపాక రమేష్, సమంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పథకంలో సవరణలను వెంటనే వెనక్కి తీసుకోవాలి



**మహా దుమ్ముగూడెం:** మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం లో కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన సవరణలను వెంటనే నిలిపివేయాలని పర్ణశాల గ్రామపంచాయతీ ఉపాది హామీ పథకం సామాజిక తానికి గ్రామసభలో గ్రామ పంచాయతీ ప్రజలు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మెమోరాండం ని ఉపాధి హామీ అధికారిని సుకన్యకు అందజేశారు. అనంతరం సర్పంచ్ ఖాదర్ బాబు అధ్యక్షతన జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామ సభలో గ్రామ పటేల్ కొమరం దామోదర్ రావు మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఆనాటి ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం చేసి జాతిపిత మహాత్మా గాంధీ పేరును ఆ పథకానికి పెట్టగా ఆ పేరును ప్రస్తుత బిజెపి నాయకత్వంలో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం తొలగించి జాతిపితను అవమానం చేసిందని అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచులు గ్రామపంచాయతీల ప్రజలు సామాజిక తనిఖీ కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి పథకంలో నూతనంగా సవరించిన సవరణలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మెమొరండాలు ఇస్తూ తీర్మానాలు చేసి ప్రభుత్వానికి ఉన్నతాధికారులకు పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిసా కార్యదర్శి వాగే రాజేశ్వరి, వార్డు సభ్యులు పూనెం. కవిత, మట్ట సమ్మక్క, గుగులోతు ఉమామహేశ్వరి, వాగే అల్లేష్, మడకం లక్ష్మి, గ్రామ పంచాయతీ ప్రజలు గోసంగి. కిరణ్, సకినం. సంజీవ రావు, వాగే శ్యాంకుమార్, బాడిసె. మహాలక్ష్మి, సకినం రోషిని తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రహిత తెలంగాణ కోసం కృషి చేయాలి

**జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్.సుబ్బారావు**



**నేలకొండపల్లి, మహా:** టీబీ రహిత తెలంగాణ కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్.వి.సుబ్బారావు సూచించారు. మండలంలోని బైరవునిపల్లి గ్రామంలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ను నిర్వహించారు. ప్రత్యేక వైద్య శిబిరం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... జిల్లాలో క్షయ వ్యాధి లేకుండా చేయాలని సూచించారు. అందుకు ప్రతీ ఒక్కరూ టీబీ పై విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. క్షయ వ్యాధి పై ప్రతీ ఒక్కరికి . అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోగులకు ఉచితంగా.. ముందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. క్రమం తప్పకుండా వాడితే వ్యాధి నివారించవచ్చునని అన్నారు. జిల్లాలో పూర్తిగా క్షయ నివారణ కేంద్రంగా గుర్తింపు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుండపనేని లక్ష్మణ్వు, మండల వైద్యాధికారి డాక్టర్. శ్రావణ్ కుమార్, డాక్టర్.సన, ఉప సర్పంచ్ ఆలేటి మహేష్, పంచాయతీ కార్యదర్శి రవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఆరఅండ్‌బీ ఎస్‌ఈ



**కారేపల్లి, మహా :** కారేపల్లి ' పేరుపల్లి మధ్య బీటీ, సీసీ రోడ్డు పనులను ఆర్ అండ్ బీ ఎస్ ఈ యాకూబ్ మంగళవారం పరిశీలించారు. కారేపల్లి సొసైటీ కార్యాలయం సమీపంలోని నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జీ పనులను ఆయన పరిశీలించారు. కోమరం భీం సెంటర్ నుండి పేరుపల్లి రైల్వేగేటు వరకు సీసీ రోడ్డు పనులను ఎస్ ఈ తనిఖీలు చేశారు. నిర్మాణంలో తీసుకోవల్సిన చర్యలను ఏఈ, కాంట్రాక్టర్ సూచనలు చేశారు. రహదారి పనులను వాడుతున్న మెటిరీయల్‌లు, నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేశారు. పనుల నాణ్యతలో రాజీ లేకుండా చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు.

# శాస్త్రీయ దృక్పథానికి సైన్స్ ద్రోహర్ పడుతుంది

**సత్తుపల్లి ఎంవీఐ రాజశేఖర్**




**సత్తుపల్లి, మహా:** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి, సమాజ ప్రగతికి సైన్స్ ఎంతగానో దోహద పడుతుందని సత్తుపల్లి మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం ( ఫిబ్రవరి 28) పురస్కరించుకొని విశ్వశాంతి విద్యాలయంలోఈ నెల 19న సైన్స్ పట్ల విద్యార్థులకు అవగాహన పోటీలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం ముందస్తు సైన్స్ క్విజ్ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం రాజశేఖర్ మాట్లాడుతూ సైన్స్ క్విజ్ నిర్వహించడం వలన శాస్త్రీయ జ్ఞానం పెరుగుతుందని, విద్యార్థులలో శాస్త్ర విషయాలపై అవగాహన, జ్ఞానం, ఆసక్తి, కుతూహలం పెరుగుతుందన్నారు. క్విజ్ వల్ల కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తి కలుగుతుందని పోటీ భావన పెరుగుతుందన్నారు. చదువు సరదాగా సాగుతుంది. ఈ సందర్భంగా విశ్వశాంతి ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ సైన్స్ క్విజ్‌లో పాల్గొనడం వలన ఆత్మవిశ్వాసం, వేగంగా ఆలోచించే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ప్రశ్నలకు త్వరగా సమాధానం చెప్పడం ద్వారా మెదడులో చురుకుదనం పెరుగుతుందన్నారు .సైన్స్ శాస్త్రవేత్తల గురించి అవగాహన కలుగుతుందని,విద్యార్థులు ప్రముఖ శాస్త్రవేత్తల పరిశోధనలు తెలుసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. సైన్స్ క్విజ్ వలన చదువు సరదాగా, ఆసక్తిగా మారుతుందని.సైన్స్ క్విజ్ నిర్వహించడం వలన భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ప్రేరణ నిస్తుందన్నారు. పోటీ నిర్వాహకులు శారద, అనిల్, బి .నరేంద్ర లను స్కూల్ యాజమాన్యం నాగేశ్వరరావు, సత్యనారాయణ అభినందించారు .

# సీఎం కప్ విజయాలు జిల్లాకు గర్వకారణం

**జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** రాష్ట్ర యువజన సర్వీసులు క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు సాధించిన విజయాలు జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ పోటీలలో జిల్లా నుండి పాల్గొన్న క్రీడాకారులు వివిధ క్రీడా విభాగాలలో ప్రతిభ కనబరచి మొత్తం 54 పతకాలు సాధించడం విశేషమని అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఐడీఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పతక విజేతలను అభినందించి వారి కృషిని ప్రశంసించారు. క్రీడాకారులు సాధించిన 15 బంగారు, 19 వెండి, 20 కాంస్య పతకాలు జిల్లాకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని తెలిపారు. ముఖ్యంగా అథ్లెటిక్స్ విభాగంలోనే 31 పతకాలు సాధించడం జిల్లాలో క్రీడా అభివృద్ధి దిశగా సానుకూల పరిణామమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన యువ క్రీడాకారులు కూడా సమానంగా ప్రతిభ చాటుకోవడం అభినందనీయమని క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ నాయకత్వ లక్షణాలు జట్టు భావన పెంపొందుతాయని కలెక్టర్ అన్నారు. క్రీడలు విద్యతో పాటు సమాన ప్రాధాన్యత పొందాలని పాఠశాల స్థాయిలోనే ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. క్రీడాకారుల విజయాలలో కోచ్‌లు శిక్షకులు పాఠశాలల ప్రిన్సిపాళ్లు వ్యాయామ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారుల సహకారం ప్రశంసనీయమని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో జాతీయ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా జిల్లా క్రీడాకారులు రాణించేలా అవసరమైన శిక్షణ మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ స్పష్టం చేశారు.

# ప్రజల ఆదరాభిమానాలకు రుణపడి ఉంటాం

**16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం 16వ డివిజన్ లో అంబేద్కర్ చమన్ నెహ్రూ బస్తీ ఏరియాలోని ప్రజలు 16 వ డివిజన్ కార్పొరేటర్ దంపతులు మునిగడప పద్మ వెంకటేశ్వర్లను ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించి వారి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన సన్మాన సభలో మునిగడప పద్మ మాట్లాడుతూ 16వ డివిజన్ ప్రజల ఆదరాభిమానాలకు ఆప్యాయతకు గత మూడు పర్యాయాలు మాకు ఇచ్చిన విజయానికి జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. రానున్న ఈ ఐదు సంవత్సరాల్లో డివిజన్ ప్రజల కష్టసుఖాల్లో వారికి ప్రభుత్వం నుండి రావలసిన సంక్షేమ ఫలాల విషయంలో కూడా అందుబాటులో ఉండి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. 16వ డివిజన్ ను అభివృద్ధిలో నడిపించడానికి స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా సహకారాన్ని తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో శాంతక్క, ఎన్.సరోజిని, కరుణమ్మ, కంచర్ల రవి, లీల, సారయ్య, పద్మ, సంగీతరావు, క్రిస్టఫర్, కన్నమ్మ, రాజేశ్వరి, రాధ, దొంగ హేమలత, సింధు, బస్తి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు గడువులోపు పూర్తి చేయాలి..

**ఎమ్మెల్యే పాయం సమగ్ర సమీక్ష..**




**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని మణుగూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజా భవన్‌లో మంగళవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అన్ని విభాగాల ఇంజనీరింగ్ అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.పంచాయితీ రాజ్ శాఖ, ఇరిగేషన్ శాఖ, రోడ్లు భవనాల శాఖ, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, గిరిజన సంక్షేమ శాఖ, ప్రజా ఆరోగ్య శాఖ, తెలంగాణ రెసిడెన్షియల్ సోషల్ వెల్ఫేర్ పాఠశాలల సంఘం తదితర విభాగాలకు చెందిన అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు.ప్రస్తుతం పనులు ఎంతవరకు పూర్తయ్యాయి, పెండింగ్‌లో ఉన్న పనులు ఏవి, కొత్తగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు ఏమిటి, పనుల పూర్తి గడువు ఎప్పటివరకు ఉంటుందనే అంశాలపై ఎమ్మెల్యే వివరాలు కోరారు. ప్రతి శాఖ అధికారి తమ విభాగానికి సంబంధించిన పనుల పూర్తి తేదీలను స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. నిర్ణయించిన గడువులోపు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ సమీక్ష ద్వారా అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సమావేశంలో అన్ని ఇంజనీరింగ్ విభాగాల కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు.జారీ చేసినవారు.

# ఏజెన్సీలో అధికారుల అక్రమ దోపిడిని అరికట్టాలి..

**మల్లు దొర**

**మహా దుమ్ముగూడెం:** ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి చట్టాలకు విరుద్ధంగా అధికారులు చేపడుతున్న అక్రమ దోపిడీలను అరికట్టాలి అని ఏవిఎస్పి జిల్లా అధ్యక్షులు సోంది మల్లు దొర ఆరోపించారు.ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ని సంఘం సభ్యులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న అధికారులు అక్రమ దారులకు వంత పలుకుతూ చూసి చూడనట్టుగా వ్యవహరించే పరిస్థితి నెలకొంది అని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా కొందరి గిరిజనేతరుల కబ్జాలో పదులు సంఖ్యలో ప్రభుత్వ భూములు ములుగుతున్నా ఆ భూములను స్వాధీనపరచుకోవడంలో అధికారులు అవుతున్నారని అన్నార. దుమ్ముగూడెం ప్రాంతం లో విచ్చలవిడిగా ఇసుక,మట్టి దోపిడీ జరుగుతుందని వాటిని అరికట్టాలని కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిస్పి రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ, ఏవీఎస్పీ డివిజన్ నాయకులు కారం గోపాల్, కూరం బొరయ్య తెల్లం రవిరాజ్ పాల్గొన్నారు.

# సత్తుపల్లి ప్రథమ పౌరుల ఆధ్వర్యంలో మహా అన్నదానం

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మట్టా రాగమయి**



**సత్తుపల్లి, మహా:** పట్టణ పరిధిలోని లలిత కుమారి హాస్పిటల్ రోడ్ ఆంజనేయ స్వామి గుడి ప్రాంగణంలో మంగళవారం ఆంజనేయ భక్తులకు మున్సిపల్ చైర్మన్ రిహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాదే చెన్నారావు, కమల్ పాషా, కౌన్సిలర్లు విరివాడ అపర్ణ భూషణం, హకీం పాషా, సీనియర్ నాయకులు కొత్తూరు ప్రభాకర్ రావు, చల్లగళ్ళ కృష్ణయ్య, పట్టణ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమాలకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు చేపట్టాలి

**కారేపల్లి, మహా :** మహిళల పేరుతో అక్రమంగా రుణాలు తీసుకున్న విజేత మండల మహిళ సమాఖ్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఐద్వా వైరా డివిజన్ అధ్యక్షురాలు కొండెబోయిన ఉమావతి డిమాండ్ చేశారు. మంగళవారం కారేపల్లిలో జరిగిన ఐద్వా సమావేశంలో ఆమె మాట్లాడుతూ విజేత మండల మహిళా సమైక్య సిబ్బంది పరిధిలోని కొన్ని గ్రామాలలోని గ్రూపు సభ్యుల పేరుతో అక్రమంగా సిఐఎఫ్, స్త్రీ నిధి రుణాలు తీసుకున్నారన్నారు. రుణాల మంజూరు చేయించే సందర్భంలో పర్సంటేజీ తీసుకొనటమే కాకుండా ఏకంగా గ్రూపు సభ్యుల పేరుతో రుణాలు తీసుకొని తమే తిరిగి చెల్లిస్తామని నమ్మబలికి కొంతకాలం చెల్లించారన్నారు. అక్రమంగా తీసుకున్న రుణాలను చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు అమాయక గ్రూపు సభ్యులు కట్టాలని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గ్రూపు సభ్యులకు చెందిన పొదుపు ఖాతాలను హోల్డు లో పెట్టటం, జప్తిలు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. అక్రమంగా రుణాలు తీసుకున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారి నుండి రుణాలను రికవరి చేయాలని డిమాండ్ చేశారు. స్వయం సహాయక సంఘాల రుణాలు మంజూరులో పారదర్శకంతా లోపించిందని, డ్వాక్రా మహిళలకు విధివిధానాలను తెలియజేప్పే వారే అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు.వీరిపై సరైన అజమాయిషి లేక పోవటమే దీనికి కారణమన్నారు. గ్రూపు రుణాలపై సోషల్ ఆడిట్ నిర్వహించి అక్రమాలను వెలికి తీయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రూ.20 వేలకోట్ల పెట్టుబడి: ఎయిర్‌టెల్ ప్లాన్ ఏంటి?

మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ బ్యాంకింగేతర అనుబంధ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ) ఎయిర్‌టెల్ మనీ లిమిటెడ్‌పై భారీ ప్రణాళికలు ప్రకటించింది. రానున్న కొన్నేళ్లలో రూ. 20,000 కోట్ల పెట్టుబడులకు తెరతీయనున్నట్లు పేర్కొంది. వీటిలో 70 శాతం ఎయిర్‌టెల్ సమకూర్చనుండగా.. మిగిలిన 30 శాతం ప్రమోటర్ గ్రూప్ సంస్థ భారతీ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా లభించనున్నట్లు తెలియజేసింది. ఎయిర్‌టెల్ మనీ ఇటీవలే(2026 ఫిబ్రవరి 13న) ఆర్‌బీఐ నుంచి ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్‌ను పొందింది. పటిష్ట డిజిటల్ ఆస్తులు, 500కుపైగా సైంటిస్టులతో నడుస్తున్న భారీ డేటా ఎనలిటిక్స్, లోతైన నిర్వహణా సామర్థ్యాలు కలిగిన కంపెనీగా ఎయిర్‌టెల్ కొత్తతరహా డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసులను దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు ఒక ప్రకటనలో వివరించింది.డిజిటల్ ప్లాట్‌ఫామ్, సమీకృత చానళ్ల ద్వారా గత రెండేళ్లుగా క్రెడిట్ ఇంజిన్‌ను నిర్మించినట్లు పేర్కొంది. దీంతో దేశీయంగా పటిష్ట రుణ సర్వీసుల మోడళ్లలో ఒకటిగా ఆవిర్భవించినట్లు తెలియజేసింది. ఇప్పటికే రూ. 9,000 కోట్లకుపైగా రుణాల విడుదల ద్వారా ప్లాట్‌ఫామ్ అత్యున్నతస్థాయి(హైపర్‌స్కేల్)ని అందుకున్నట్లు వెల్లడించింది. ఇందుకు పటిష్ట అండర్‌రైటింగ్ విధానాలు, క్రమశిక్షణాయుత పోర్ట్‌ఫోలియో నిర్వహణ, రియల్‌టైమ్ రిస్క్ పర్యవేక్షణ దోహదపడినట్లు వివరించింది.




# కోబాల్ షాక్

- ఐటీ షేర్లలో అమ్మకాల సునామీ
- 1069 పాయింట్లు పతనమైన సెన్సెక్స్
- నిఫ్టీకి 288 పాయింట్ల నష్టం
- రూ. 2.85 లక్షల కోట్ల సంపద ఆవిరి

**ముంబై:** అమెరికా ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్ కొత్త అప్‌డేట్ తీసుకొచ్చినప్పుడల్లా 'ఐటీ మార్కెట్' వణికిపోతోంది. తాజాగా కోబాల్ వంటి పాత ప్రోగ్రామింగ్ భాషలతో పనిచేస్తున్న సిస్టమ్‌లు కొత్త టెక్నాలజీకి అనుగుణంగా మార్చేందుకు తమ 'క్లాడ్ కోడ్' టూల్ ఉపయోగపడుతుందని ప్రకటించింది. ఈ కోడింగ్ టూల్స్‌తో ఐటీ రంగంలో సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులపై వ్యయాలు తగ్గి, కంపెనీల ఆదాయాల పరిమితం కావొచ్చని పరిశ్రమ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో ఐటీ షేర్లలో వెల్లువెత్తిన విక్రయాలతో దేశీయ స్టాక్ మార్కెట్ మంగళవారం ఒకశాతానికి పైగా పతనమైంది.అంతర్జాతీయ వాణిజ్య సంబంధిత అనిశ్చితులు, క్రూడాయిల్ ధరలు, అమెరికా-ఇరాన్ యుద్ధ ఉద్రిక్తతలు సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 1069 పాయింట్లు పతనమై 82,226 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 288 పాయింట్లు నష్టపోయి 25,425 వద్ద నిలిచింది. ఒక్కరోజే రూ.2.85 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది. బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.466 లక్షల కోట్లకు దిగివచ్చింది. అంతర్జాతీయంగా డాలర్ పుంజుకోవడం, క్రూడాయిల్ ధరలు పెరగడంతో డాలర్ మారకంలో రూపాయి విలువ 6 పైసలు బలహీనపడి 90.95 వద్ద స్థిరపడింది.



**బలహీనంగా మొదలై.. భారీ నష్టాల్లోకి..**

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే బలహీనంగా మొదలయ్యాయి. ట్రేడింగ్ గడిచే కొద్దీ మరింత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా ఏఐ భయాలు ఇన్వెస్టర్లను ఆందోళనలకు గురిచేయటంతో ఐటీ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడితో చిత్తు అయ్యాయి. రియల్టీ, మీడియా స్టాక్స్ కూడా భారీగానే నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,360 పాయింట్లు క్షీణించి 82 వేల స్థాయి దిగువన 81,934 వద్ద, నిఫ్టీ 385 పాయింట్లు పతనమై 25,328 వద్ద ఇంట్రాడే కనిష్టాలు నమోదు చేశాయి. అలాగే మంగళవారం నిఫ్టీ డెరివేటివ్స్ కాంట్రాక్టుల వీక్లీ ఎక్స్‌పైరీ కావడంతో ట్రేడర్లు తమ పొజిషన్లను మార్పు, చేర్పులు చేసుకోవడంతో ఇంట్రాడేలో సూచీలు భారీ ఊగిసలాటలకు లోనయ్యాయి. ఆంత్రోపిక్ తాజా అప్‌డేట్ ప్రకటనతో భారత ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. ఎల్‌టీఐఎం 6.50%, టెక్ మహీంద్రా 6.17%, పెర్సిస్టెంట్ 6%, హెచ్‌సీఎల్ టెక్ 5.83%, కోఫోర్జ్ 5.24% క్షీణించాయి. ఎంఫసిస్ 3.67%, టీసీఎస్ 3.56%, ఇన్ఫోసిస్ 3.56%, విప్రో 3% పతనమయ్యాయి. ఎన్ఎస్ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే నిఫ్టీ ఐటీ ఇండెక్సు 4.8% నష్టపోయింది. కృత్రిమ మేధ ఆందోళనలతో నిఫ్టీ ఐటీ ఇండెక్సు ఈ ఫిబ్రవరిలో ఏకంగా 21% కుప్పకూలింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం(2008) తర్వాత ఈ సూచీ ఒక నెలలో ఆ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. బీఎస్ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో ఐటీ 5%, రియల్టీ 2.61%, టెలీకమ్యూనికేషన్ 1.79%, కన్జూమర్ డిస్క్రెషనరీ 1.12%, ఇండస్ట్రియల్స్ 0.91%, క్షీణించాయి. స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 0.68%, 0.54% చొప్పున క్షీణించాయి. ప్రపంచ దేశాలపై ట్రంప్ విధించిన సుంకాలు చెల్లవంటూ యూఎస్ సుప్రీం కోర్టు తీర్పు తర్వాత కూడా ఇతర చట్టాల ద్వారా టారిఫ్‌లు విధిస్తామని ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. ఆసియా మార్కెట్లలో ఇండోనే□□యా 1.4%, హాంగ్‌కాంగ్ 1.85%, సింగపూర్ 0.4% పతనమయ్యాయి. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ సూచీలు అరశాతం వరకు పతనమయ్యాయి. అమెరికా స్టాక్ సూచీలు ఆరంభంలో భారీగా పడి, వెంటనే కోలుకుని లాభాలతో ట్రేడవుతున్నాయి.

**ఐబీఎంకు ఆంత్రోపిక్ భయం**

ఐబీఎం సిస్టమ్‌స్‌లో ఉపయోగించే ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ కోబాల్‌ను తమ 'క్లాడ్ కోడ్ టూల్ ఆధునీకరించగలదంటూ ఆంత్రోపిక్ చేసిన ప్రకటనతో ఐబీఎం షేరు కుప్పకూలింది. సోమవారం ఏకంగా 13.2% క్షీణించి 223.35 డాలర్ల వద్ద ముగిసింది. 2000 అక్టోబర్ తర్వాత ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. షేరు భారీ పతనంతో కంపెనీ మార్కెట్ విలువకు ఒక్కరోజే 40 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది.

# ఏఐతో ఐటీకి ఇబ్బందే...

## మార్పు ప్రక్రియ బాధాకరమే...
## కానీ కంపెనీలు రూపాంతరం చెందక తప్పదు
## హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్

**ముంబై:** పెద్ద సంఖ్యలో ఉద్యోగులతో ముడిపడి ఉన్నందున కృత్రిమ మేధకు (ఏఐ) మారడం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమకు బాధాకరమైన ప్రక్రియగానే ఉంటుందని హెచ్‌సీఎల్ టెక్ సీఈవో విజయకుమార్ చెప్పారు. అయితే, గతంలో వై2కే సవాళ్లు వచ్చినప్పుడు దీటుగా ఎదుర్కొన్నట్లుగానే, పరిశ్రమ తిరిగి తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఇందుకు కావాల్సిన సామర్థ్యాలు పరిశ్రమకు ఉన్నాయని పేర్కొన్నారు. ఐటీ షేర్ల విషయంలో ఇన్వెస్టర్లు మరీ ఎక్కువగా ఆందోళన చెందుతున్నారన్నారు.



ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ నిర్వహించిన టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ ఫోరం సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాలు తెలిపారు. ఏఐ మోడల్స్ రాకతో భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా పలు టెక్ కంపెనీలు పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్న నేపథ్యంలో కుమార్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం దేశీ ఐటీ రంగం కీలక దశలో ఉందని, వచ్చే 5-10 ఏళ్లలో పరిశ్రమ సరికొత్తగా రూపాంతరం చెందే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. కోడింగ్ విషయంలో ఆంత్రోపిక్ క్లాడ్ అత్యద్భుతంగా పని చేసినప్పటికీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో కోడింగ్ వాటా 30 శాతమే ఉంటుంది కాబట్టి పరిశ్రమలో అవకాశాలు మెరుగ్గానే ఉండొచ్చన్నారు.

**ప్రత్యేక నైపుణ్యాలకు డిమాండ్**

రాబోయే రోజుల్లో ప్రత్యేక నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతుందని, దానికి తగ్గట్లుగా ఉద్యోగులు, ఉద్యోగార్థులు సామర్థ్యాలను పెంచుకోవాల్సి ఉంటుందని కుమార్ చెప్పారు. క్లయింట్లకు భారీగా బిల్లింగ్ వేస్తూ, గణనీయంగా వృద్ధి చెందిన సాస్ (సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్) కంపెనీలకు, ఇకపై అదే స్థాయిలో చార్జీలు విధించడం సాధ్యపడదు కాబట్టి అవి సవాళ్లు ఎదుర్కొనాల్సి రావొచ్చని పేర్కొన్నారు. పెట్టుబడులకు తగ్గ స్థాయిలో ఆదాయాలు వచ్చే అవకాశాలు లేనందున విస్తృత స్థాయిలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంపై భారీగా ఇన్వెస్ట్ చేసిన సంస్థలకు సమస్యలు ఎదురుకావొచ్చన్నారు.

# ఫోన్‌పే పనితీరు ఓకే..

**న్యూఢిల్లీ:** ఐపీవో బాటలో సాగుతున్న ఫిన్‌టెక్ దిగ్గజం ఫోన్‌పే పనితీరు మెరుగుపడుతున్నట్లు తాజా వివరాలు వెల్లడిస్తున్నాయి. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి దాఖలు చేసిన ముసాయిదా ప్రాస్పెక్టస్ ప్రకారం చూస్తే.. గత మూడేళ్లలో ఆదాయం, లాభదాయకత, నగదు ఆర్జన పుంజుకున్నట్లు తెలుస్తోంది. నిర్వహణ ఆదాయం గతేడాది(2024-25) రూ. 7,115 కోట్లకు చేరింది. 2022-23లో నమోదైన రూ. 2,914 కోట్లతో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన 56 శాతం జంప్‌చేసింది. వివిధ బిజినెస్ విభాగాల మానిటైజేషన్ సైతం ఇందుకు సహకరించింది.వీటిలో మర్చంట్ చెల్లింపులు, రుణాలు, బీమా పంపిణీ కలగలసి ఉన్నాయి. ఆదాయంలో మర్చంట్ పేమెంట్ల బిజినెస్ 15 శాతం నుంచి 2025కల్లా 28 శాతానికి బలపడగా.. 2025 సెప్టెంబర్ తో ముగిసిన ఆరు నెలల్లో 31 శాతానికి ఎగసింది. రుణాలు, బీమా పంపిణీ విభాగం సైతం 2023లో నామమాత్ర వృద్ధి కనబరచగా.. 2025కల్లా 8 శాతానికి, తదుపరి ఆరు నెలల్లో 12 శాతానికి పుంజుకుంది. ఇది కంపెనీకి కీలకమైన చెల్లింపుల బిజినెస్ నుంచి డైవర్సిఫికేషన్‌ను సూచిస్తోంది. పలు అంశాలలో నిర్వహణా పనితీరు మెరుగుపడిన నేపథ్యంలో ఫిన్‌టెక్ కంపెనీ ఫోన్‌పే నష్టాలు సైతం తగ్గుతూ వస్తున్నాయి. గతేడాది రూ. 1,727 కోట్ల నష్టాలు నమోదయ్యాయి. 2023తో పోలిస్తే రూ. 1,069 కోట్లమేర రికవర్ అయ్యాయి. ఇదే కాలంలో నష్టాల మార్జిన్ 90.68 శాతం నుంచి 22.64 శాతానికి మెరుగుపడ్డాయి. గత రెండేళ్ల(2024, 2025)లో సర్దుబాటు తదుపరి నిర్వహణ లాభం(ఇబిటా) సానుకూలస్థాయికి చేరింది.



## దేశం-విదేశం
## NATIONAL-INTERNATIONAL

# యుద్ధనౌకలో టాయిలెట్ కష్టాలు

## జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ విమాన వాహననౌకలో పనిచేయని టాయిలెట్లు

### 5,000 నావికులను పట్టిపీడిస్తున్న కొత్త సమస్య .. రోజు రిపేర్లతోనే గడిపేస్తున్న మెయింటెనెన్స్ సిబ్బంది

### 8 నెలలుగా సముద్రంలోనే ఉండటంతో మానసికంగా కుంగిపోయిన సెయిలర్లు

**వాషింగ్టన్:** యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్. ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన యుద్ధవిమాన వాహననౌక. అమెరికా అమ్ములపొదిలోని శక్తివంతమైన సముద్ర ఆయుధంగా దీనికి పేరుంది. గత 8 నెలలుగా సముద్రజలాల్లో విధుల్లో పాల్గొంటూ వెనెజువెలాలో మదురోపై మెరుపుదాడి చేసిన యుద్ధవిమానాల ల్యాండింగ్, టేకాఫ్ బాధ్యతలను నిర్వర్తించిన ఘనత జెరాల్డ్ యుద్ధనౌకదే. వెనెజువెలా మొదలు ఇరాన్ దాకా పలు దేశాల వెన్నులో వణుకు పుట్టిస్తున్న ఈ నౌక ఇప్పుడు సొంత సిబ్బందికీ సమస్యలు తెచ్చిపెడుతోంది. 8 నెలలుగా సముద్రంలో ఎలాంటి పూర్తిస్థాయి మెయింటెనెన్స్‌లేకపోవడంతో ఇందులోని టాయిలెట్, మురుగునీటి పారుదల వ్యవస్థలు దాదాపు పూర్తిగా విఫలమయ్యాయి. దీంతో నౌకలోని 650 టాయిలెట్లు పనిచేయకుండా పోయాయి.



ఫ్లష్ విధానంలో పనిచేసే అధునాతన టాయిలెట్లు తరచూ మొరాయిస్తుండటంతో నిర్వహణ సిబ్బంది రోజుకు దాదాపు 19 గంటలు వీటిని మరమత్తుచేయడంలో మునిగిపోతున్నారు. దీంతో నౌకలోని దాదాపు 5,000 మంది సిబ్బంది కాలకృత్యాల కోసం క్యూ వరసల్లో నిలబడి అవస్థలు పడుతున్నారు. యుద్ధరంగంలో శత్రువుకు ఎదురు నిలబడాల్సిన సెయిలర్లు ఇలా టాయిలెట్ల వద్ద నిలబడి తమ వంతు కోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నారని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇందులో విధులు నిర్వర్తించలేక తిరుగుపయనమైన కొందరు నావికులను ఇంటర్వ్యూచేసి ప్రఖ్యాత వాల్‌స్ట్రీట్ జర్నల్ సంస్థ ఒక సమగ్ర కథనాన్ని వెలువర్చింది. అణువిద్యుత్‌తో పనిచేసే ఈ యుద్ధనౌక అమెరికా విదేశాల్లో సముద్రజలాల వేదికగా జరిపే దాడులకు గుండెకాయగా ఉంటోంది.

**బ్లాకేజీలు.. లీకేజీలు..**

గత షెడ్యూల్‌కు మించి ఏకంగా ఎనిమిది నెలలుగా నౌకాశ్రయానికి రాకుండా అంతర్జాతీయ సముద్రజలాల్లోనే ఉండిపోవడంతో మెయింటెనెన్స్ అనేది లేకుండా పోయింది. దీంతో నౌకలోని మురుగునీటి పారుదల వ్యవస్థ దాదాపు విఫలమైంది. నౌకలోని అత్యధిక స్థలాన్ని యుద్ధ ఆయుధాలు, అనుబంధ వ్యవస్థల కోసం కేటాయించి టాయిలెట్లను ఇరుకైన ప్రాంతాల్లో చిన్నగా నిర్మించారు. ఇది కూడా సీవేజ్ వ్యవస్థ వైఫల్యానికి మరో కారణమని చెబుతున్నారు. ఇది నావికుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీస్తోందని, పలువురు ఉద్యోగాలకు రాజీనామా చేసి అమెరికాకు తిరిగొచ్చేయాలని భావిస్తున్నారని తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొండిగా మరి కొన్ని నెలలపాటు నౌకను సముద్రంలోనే కొనసాగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో యుద్ధం ఇంకా మొదలుకాలేదు. యుద్ధం ఆరంభమైతే ఈ నౌక నుంచే ఎఫ్-18 యుద్ధవిమానాలు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.కీలకమైన మిషన్ కావడంతో నౌకను ఇప్పట్లో వెనక్కి తీసుకొచ్చే ఆలోచన లేదని తెలుస్తోంది. దీంతో ఇంకెంతకాలం నౌకలో ఉండిపోవాలనే బాధ నావికుల్లో గూడుకట్టుకుపోయిందని వాల్‌స్ట్రీట్ జర్నల్ తన కథనంలో పేర్కొంది. పశ్చిమాసియాలో పాగా వేసిన యుద్ధనౌకలోని టాయిలెట్ వ్యవస్థను సరి చేసేందుకు సాంకేతిక నిపుణులు రోజుకు 19 గంటలు నిరాటంకంగా పనిచేయాల్సివస్తోంది. కొన్ని చోట్ల బ్లాకేజీలు ఉంటే మరికొన్ని చోట్ల లీకేజీలు ఇబ్బంది పెడుతున్నాయి. టీ-షర్ట్‌లు మొదలు నాలుగు అడుగుల తాడుసహా ప్రతిదానితో లీకేజీలను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

**గతంలోనూ ఇదే తీరు**

నౌకలో టాయిలెట్ సమస్య గతంలోనూ వెలుగు చూసింది. గత ఏడాది మార్చిలో నాలుగు రోజుల వ్యవధిలోనే 205 టాయిలెట్లు పనిచేయకుండా చేతులెత్తేశాయి. వాక్యూమ్ ఆధారిత వ్యవస్థపై ఈ టాయిలెట్లు పనిచేస్తున్నాయి. అంటే ఒక వాల్వ్‌లో ఏదైనా సమస్య వస్తే దానితో అనుసంధానమైన టాయిలెట్లు అన్నీ పనిచేయకుండా పోతాయి. దీంతో సమస్య శృంఖల చర్యల పెరుగుతూపోయి మరింత పెద్దదవుతుంది. వాల్వ్‌లోపల కాల్షియం పేరుకుపోవడంతో ఈ సమస్య దాపురించిందని టెక్నీయన్లు చెప్పారు. సన్నటి పైపులు ఈ సమస్యను మరింత జఠిలం చేస్తున్నాయి. సమస్యకు చెక్‌పెట్టేందుకు ప్రతిసారి యాసిడ్ ద్రావకాలను ఉపయోగిస్తున్నారు. దీంతో ఖర్చు తడిసి మోపెడవుతోంది.ప్రతిసారీ యాసిడ్ కోసం ఏకంగా రూ.3.63 కోట్లు ఖర్చుచేస్తున్నారు. సెయిలర్లలో అత్యధికులు 20 ఏళ్లలోపు వాళ్లే. శాంతికాలంలో ఇలాంటి యుద్ధనౌకలో గరిష్ఠంగా ఐదారు నెలలకుమించి సముద్రజలాల్లో ఉండవు. కానీ ఇప్పుడు ఎలాంటి యుద్ధం లేకపోయినా ఎనిమిది నెలలుగా పశ్చిమాసియా సముద్రజలాల్లో కుటుంబసభ్యులకు దూరంగా ఉండటంతో నావికుల మనోధైర్యం దెబ్బతింటోంది. పుట్టినరోజులు, పెళ్లిరోజులు, చివరకు బంధువుల అంత్యక్రియలకు సైతం వెళ్లలేకపోతున్నామని పలువురు మీడియా ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. ఇంత జరుగుతున్నా ట్రంప్ మాత్రం తనదైన శైలిలో స్పందించినట్లు తెలుస్తోంది. ''ఇంతకంటే పెద్ద సమస్యలు దేశానికి ఉన్నాయి. వాటి సంగతి చూడాలి''అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ నౌకను ఏకంగా రూ.1.18 లక్షల కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ నౌకతోపాటు మరో యుద్ధవిమాన వాహకనౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌నూ అమెరికా రంగంలోకి దింపింది. వీటితో పాటు తొమ్మిది డిస్ట్రాయర్ నౌకలు, మూడు లిట్టోరల్ యుద్ధనౌకలు పశ్చిమాసియాలో మోహరించాయి. ఇన్నేసి నౌకలను అమెరికా పశ్చిమాసియాలో మోహరించడం అత్యంత అరుదైన విషయమని యుద్ధరంగ నిపుణులు చెబుతున్నారు.

# ఈశాన్య అమెరికాను వణికిస్తున్న మంచు తుపాను

## 11 వేలకుపైగా విమానసర్వీసులు రద్దు .. విద్యుత్ అంతరాయంతో 5లక్షల ఇళ్లలో అంధకారం

**న్యూయార్క్:** అమెరికా ఈశాన్య రాష్ట్రాల ప్రజలను మంచు తుపాను గజగజా వణికిస్తోంది. అంతటా అరమీటర్ మందంతో మంచు పేరుకుపోవడంతో రైలు, విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్లపై వాహనాల రాకపోకలపై నిషేధం కొనసాగింది. మంచుతుపాను దెబ్బకు ఇప్పటిదాకా 11,055 విమానసర్వీసులను రద్దుచేశారు. పాత రికార్డులను బద్దలుకొడుతూ ఎనిమిది రాష్ట్రాల్లో మంచు తుపాను జనజీవనాన్ని స్తంభింపజేసింది. మేరీల్యాండ్‌లో చాలా చోట్ల అరమీటర్ మందంతో మంచు కురిసింది. ఇక రోడ్ ఐలాండ్‌లోని ప్రోవిడెన్స్ ప్రాంతంలో ఏకంగా 96.26 సెంటీమీటర్ల మందంలో మంచు కురిసింది. 1978 ఏడాది తర్వాత ఇక్కడ ఇంతటి స్థాయిలో మంచు కురవడం ఇదే తొలిసారి అని అమెరికా జాతీయ వాతావరణ సేవల విభాగం ప్రకటించింది. విద్యుత్‌స్తంభాలు, సబ్‌స్టేషన్లపై మంచు భారీగా పడటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడి దాదాపు 5,00,000 ఇళ్లకు కరెంట్ సరఫరా ఆగిపోయింది. వర్జీనియా నుంచి మసాచుసెట్స్ దాకా చాలా ప్రాంతాల్లో విద్యుత్‌లైన్లు తెగిపోయాయి. న్యూయార్క్‌లో చాలా వరకు పాఠశాలలు, వ్యాపారాలు మూతబడ్డాయి.



# 15 కాదు.. 10 శాతమే!

## అమల్లోకి ట్రంప్ టారిఫ్‌లు

**వాషింగ్టన్:** ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 10 శాతం టారిఫ్‌లు మంగళవారం నుంచి అమల్లోకి వచ్చాయి. అత్యవసర ఆర్థికాధికారాల చట్టం (ఐఈఈపీఏ) కింద ఏడాది కాలంగా పలు దేశాలపై ఆయన ఎడాపెడా విధించిన భారీ టారిఫ్‌లను అమెరికా సుప్రీంకోర్టు గత శుక్రవారం కొట్టేయడం తెలిసిందే. దాంతో చిర్రెత్తుకొచ్చిన ట్రంప్ అన్ని దేశాలపైనా కొత్తగా 10 శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్టు అప్పటికప్పుడు ప్రకటించారు.

ఆ మర్నాడే దాన్ని 15 శాతానికి పెంచుతున్నట్టు చెప్పుకొచ్చారు. కానీ యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం మాత్రం ప్రపంచ దేశాల నుంచి 10 శాతం టారిఫ్‌లు వసూలు చేయనున్నట్టు మంగళవారం ప్రకటించింది. సుప్రీంకోర్టు కొట్టేసిన టారిఫ్‌ల వసూళ్లను మంగళవారం నుంచే నిలిపేస్తున్నట్టు కూడా వెల్లడించింది.



1974 నాటి వర్తక చట్టంలోని సెక్షన్ 122 ప్రకారం ట్రంప్ విధించిన తాజా టారిఫ్‌లు గరిష్ఠంగా 150 రోజుల పాటు కొనసాగుతాయి. ఆలోపు కాంగ్రెస్ అనుమతి లభించని పక్షంలో అంతటితో వాటికి కాలదోషం పడుతుంది. ఈలోపే వాటిని ట్రంప్ ప్రకటించినట్టుగా 15 శాతానికి పెంచుతారా అన్నదానిపై ప్రస్తుతానికైతే స్పష్టత లేదు. మరోవైపు, ఐఈఈపీఏ కింద వసూలు చేసిన అధిక టారిఫ్‌లను తిరిగి చెల్లించాలంటూ ఫెడెక్స్‌తో పాటు పలు అమెరికా కంపెనీలు ఇప్పటికే ట్రంప్ సర్కారుపై కోర్టుకెక్కాయి.

ఆ చట్టం కింద అమెరికా ఏకంగా 130 బిలియన్ డాలర్ల దాకా వసూలు చేసినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కానీ ఆ మొత్తాలను తిరిగివ్వబోమని, అవసరమైతే అందుకోసం న్యాయపోరాటం చేస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. అంతేగాక వాణిజ్య ఒప్పందాల పేరిట అమెరికాతో ఆటలాడుతున్న పలు దేశాలపై హెచ్చు టారిఫ్‌లు తప్పవని సోమవారం ఆయన హెచ్చరించారు. ఈ అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో భారత్, అమెరికా వాణిజ్య ఒప్పంద చర్చలు కూడా వాయిదా పడటం తెలిసిందే.

# జోరుగా 'కల్కి' సీక్వెల్ షూటింగ్.. ప్రభాస్ ఎక్కడ?



రెండేళ్ల క్రితం వచ్చిన 'కల్కి 2898 AD' ఎంతలా ఆకట్టుకుందో తెలిసిందే. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కూడా కీలక పాత్రలు చేశారు. చివరలో ప్రభాస్‌ని కర్ణుడి పాత్రలో చూపించి సీక్వెల్‌పై అప్పుడే హైప్ పెంచారు. మరి షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా అని అందరూ మాట్లాడుకున్నారు. అయితే దీపిక.. ఈ మూవీ నుంచి తప్పుకోవడం లాంటివి జరగడంతో చిత్రీకరణ కాస్త ఆలస్యంగా మొదలైంది. దానికి తోడు ప్రభాస్ కూడా పలు మూవీస్‌తో బిజీగా ఉన్నాడు. కొన్నిరోజుల క్రితమే ఎట్టకేలకు 'కల్కి' సీక్వెల్ షూటింగ్ మొదలైంది. తొలి భాగంలో సుప్రీం యాస్కిన్ పాత్రలో భయపెట్టిన కమల్ హాసన్ ఇందులో పూర్తిస్థాయి పాత్ర చేయనున్నట్లు తెలుస్తోంది. అమితాబ్.. ఎప్పటిలానే అశ్వద్ధామగా అలరించబోతున్నాడు. తాజాగా వీళ్లిద్దరూ సెట్స్‌లో కలుసుకున్నారు. ఈ ఫొటోలని అమితాబ్ తన బ్లాగ్‌లో పోస్ట్ చేశారు. 40 ఏళ్ల తర్వాత కమల్‌తో మళ్లీ కలిసి పనిచేస్తున్నానని చెప్పుకొచ్చారు.

'దాదాపు 40 ఏళ్ల తర్వాత మళ్లీ కమల్ హాసన్‌తో కలిసి పనిచేయడం గొప్ప అనుభూతి ఇస్తోంది. చివరగా మేమిద్దరం 1985లో 'గిరఫ్తార్'లో కలిసి నటించాం' అని అమితాబ్ రాసుకొచ్చారు. వీళ్లిద్దరిపై కీలక సన్నివేశాలు తీస్తున్నారు. మరి ప్రభాస్ ఎక్కడున్నాడు? అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్స్‌తో బిజీగా ఉన్న డార్లింగ్ హీరో.. మరి ఈ సెట్స్‌కి ఎప్పుడొస్తాడనేది తెలియాల్సి ఉంది. ఇదే సినిమా తొలి భాగంలో సుమతిగా కీలక పాత్ర చేసిన దీపికా పదుకొణె.. సీక్వెల్ నుంచి తప్పుకొంది. చాన్నాళ్ల క్రితమే నిర్మాణ సంస్థ అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించింది. ఆమె స్థానాన్ని ఎవరితో భర్తీ చేస్తారా అని అందరూ అనుకుంటున్నారు. సాయిపల్లవిని తీసుకున్నారనే టాక్ వినిపించింది. కానీ నిర్మాణ సంస్థ ఈ విషయం ఎప్పుడు ప్రకటిస్తుందో ఏంటో?







# కలల ప్రయాణం

తమిళనాడులోని ఒక చిన్న పట్టణానికి చెందిన శెన్బాకి దక్షిణ కొరియాకు వెళ్లాలన్నది పెద్ద కల. ఆ కల నిజమవుతున్న ప్రయాణాన్ని చూపించే 'మేడ్ ఇన్ కొరియా' చిత్రం మార్చి 12న నెట్ ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. 'స్క్విడ్ గేమ్' ఫేమ్ దక్షిణ కొరియా నటుడుపార్క్ హ్యే–జిన్,నో హో–జిన్ ఈ సినిమాలోని ప్రధానపాత్రల్లో నటించారు. ఆర్‌ఏ కార్తీక్ దర్శకత్వంలో రైజ్ ఈస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించింది.

ఈ చిత్రవిశేషాల గురించి ప్రియాంక చెబుతూ– "మేడ్ ఇన్ కొరియా' కథ విన్నప్పుడే శెన్బాపాత్రతో నాకు బలమైన అనుబంధం ఏర్పడింది. ఇంత అద్భుతమైనపాత్ర చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది" అని చెప్పారు. "కొరియన్, తమిళ సంస్కృతుల మధ్య ఉన్న చారిత్రక అనుబంధాలు నాకు ఎంతో ఆసక్తిని కలిగించాయి. ఆ స్ఫూర్తితోనే ఈ కథ తయారు చేశాను. మనసుల్ని హత్తుకునే స్లైస్ ఆఫ్ లైఫ్ చిత్రం ఇది. భాషల్ని దాటి ప్రపంచ సంస్కృతులను కలుపుతున్న కథలను ప్రోత్సహించిన నెట్‌ఫ్లిక్స్‌కు థ్యాంక్స్" అని పేర్కొన్నారు ఆర్‌ఏ కార్తీక్. "దక్షిణాది కథలపై మా దృష్టిని బలోపేతం చేస్తూ, స్థానిక సంస్కృతిలో పాతుకుపోయిన కథలను ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్.

# రాజమౌళిగారి సినిమాలో చేయడం నా కల: నయన్ సారిక

"నటనకు స్కోప్ ఉన్నపాత్రలే చేయాలనుకుంటున్నాను. 'గం గం గణేశా, ఆయ్, క' వంటి చిత్రాల్లో డిఫరెంట్ క్యారెక్టరైజేషన్స్ చేశాను. నయన్... నటించిందంటే ఆ సినిమా బాగుంటుందని ప్రేక్షకులు అనుకోవాలన్నదే నా లక్ష్యం. దర్శకుడు రాజమౌళిగారి సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా చేయాలన్నది నా డ్రీమ్" అని చెప్పారు హీరోయిన్ నయన్ సారిక. శ్రీ విష్ణు, నయన్ సారిక జంటగా నటించిన సినిమా 'విష్ణు విన్యాసం'. యధునాథ్ మారుతీరావు దర్శకత్వంలో సుమంత్ నాయుడు .జి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నయన్ సారిక మాట్లాడుతూ– "నా స్వస్థలం మహారాష్ట్ర. నాకు చిన్నప్పట్నుంచి నటి కావాలని ఉండేది. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత యాక్టర్ అయ్యాను. ఒకవేళ నేను యాక్టర్‌ను కాకపోయి ఉంటే లాయర్‌ని అయ్యేదాన్ని. ఇక 'విష్ణు విన్యాసం' సినిమా విషయానికొస్తే... ఇందులో డిఫరెంట్ వేరియేషన్స్ ఉన్న మనీషా క్యారెక్టర్‌లో నటించాను.ఇద్దరు లెక్చరర్స్ మధ్య జరిగే ప్రేమకథతో ఈ సినిమా మొదలవుతుంది. మనీషా తన జీవితంలో ఎన్నో బాధలు ఎదుర్కొన్న అమ్మాయి.. హాయిగా బతకాలని ఆశపడే అమ్మాయి. మరి... మనీషా సమస్యలు ఏంటి? ఆమె కోరుకున్నది ఆమెకు లభించిందా? లేదా అనేది మాత్రం థియేటర్స్‌లో చూడాల్సిందే. రెయిన్ సీక్వెన్స్‌లో నటించడం సవాలుగా అనిపించింది. ఈ చిత్రదర్శకుడు మంచి క్లారిటీ ఉన్న ఫిల్మ్‌మేకర్. సినిమాకు కావాల్సిన ప్రతిదీ నిర్మాత సమకూర్చారు. నేను నటించిన 'రాకాస' చిత్రం ఏప్రిల్ 3న రిలీజ్ కానుంది. కన్నడ యాక్టర్ గణేష్‌తో ఓ సినిమా చేస్తున్నాను" అని తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com